
ఆంధ్రజ్యోతి
****
నల్లగొండ
3
సోమవారం 13 జనవరి 2025





నల్లగొండలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, చిత్రంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

అనర్హులెవ్వరికీ రైతు భరోసా అందకూడదు


- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఇందిరమ్మ రాజ్యంలో పేదవాని ఇళ్ల కల సాకారం
- రోడ్లు భవనాల శాఖ, సినిమాటోగ్రఫీ మంత్రి వెంకట్ రెడ్డి
- సేద్యానికి యోగ్యమైన ప్రతి ఎకరాకి రైతు భరోసా
- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

రాష్ట్రంలో అనర్హులెవ్వరికీ రైతుభరోసా అందకూడదని, ఆ దిశగా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లోని ఉదయాదిత్యభవన్‌లో ఆయన శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలతో కలిసి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల మంజూరుపై ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అధికారులు, శాసన సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

- (నల్లగొండ టౌన్-ఆంధ్రజ్యోతి)


5

మాట్లాడుతున్న సుఖేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

నేడు భోగి



4

మూడు రోజుల పండుగకు ఉమ్మడి జిల్లా సర్వం సన్నద్ధమైంది. సోమవారం భోగి, మంగళవారం మకర సంక్రాంతి, బుధవారం కనుమ వేడుకలు జరుపుకొనేందుకు ప్రజలు ఇప్పటికే పట్టణాల నుంచి పల్లెలకు చేరుకున్నారు. ఊళ్లన్నీ ఆడపడుచుల సందడితో కళకళలాడుతున్నాయి. నేడు భోగి సందర్భంగా చిన్నారులకు భోగి పళ్లు పోయనున్నారు.

రాజకీయ సెగ

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల సవాళ్లు, ప్రతిసవాళ్లు
- స్థానికకంకంటే ముందుగానే ఎన్నికల వేడి



స్థానిక సంస్థల ఎన్నికల వేళ.. జిల్లాలోని నియోజకవర్గాల్లో రాజకీయ వాతావరణంలో ఊహించని విధంగా వేడెక్కుతోంది. విమర్శ లు, ప్రతివిమర్శలు, సవాళ్లు... ప్రతిసవాళ్లతో నిత్యం రాజకీయం రాజుకుంది. ఈసారి జరిగే అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ క్లీన్‌స్వీప్ చేసుకునేందుకు కాంగ్రెస్ పక్కా ప్రణాళికతో ముందుకు అడుగులు వేస్తోంది. అయితే ప్రతిపక్ష పార్టీలు కూడా ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి..., ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. రానున్న సర్పంచ్, జిల్లా పరిషత్, మండల పరిషత్, సహకార సంఘాలు, మునిసిపాలిటీ ఎన్నికల్లో పైచేయి సాధించేందుకు రాజకీయ పార్టీలు పకడ్బందీ వ్యూహంతో ముందుకు సాగుతున్నాయి. జిల్లాలోని భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, తాజా మాజీ ఎమ్మెల్యేల మధ్య ప్రచ్ఛన్నయుద్ధం కొనసాగుతోంది.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

4

భువనగిరిలో హైటెన్షన్

ఎక్కడికక్కడ అడ్డగింతలు, అరెస్టులు



బీఆర్‌ఎస్, కాంగ్రెస్ వ్యూహ ప్రతివ్యూహాలు, పోలీసుల భారీ భద్రతా, భారీ కేడింగ్స్, రహదారులపై ప్రజల రాకపోకలపై కూడా విధించిన ఆంక్షలతో జిల్లా కేంద్రం భువనగిరిలో ఆదివారం తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. శనివారం జరిగిన మీడియా సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ అదే రోజు యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ కార్యకర్తలు బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంపై దాడి చేశారు. తిరిగి బీఆర్‌ఎస్ నాయకుల నిరసన ర్యాలీ, పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయింపు నేపథ్యంలో తలెత్తిన ఉద్రిక్తత రెండో రోజూ కూడా కొనసాగింది. - (భువనగిరి టౌన్-ఆంధ్రజ్యోతి)



యాదాద్రి థర్మల్ ప్లాంట్

పవర్‌ప్లాంట్ స్ర్కాప్ కుంభకోణంపై నీలినీడలు!

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంటులో స్ర్కాప్ కుంభకోణంపై విచారణ అర్థంతరంగా ఆగిపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పవర్‌ప్లాంటులో చోరీలపై 2017నుంచి కేసులు నమోదవుతున్నా పూర్తిస్థాయి విచారణ నిర్వహించకపోవ డం వెనక పెద్దమొత్తంలో ముడుపులు చేతులు మారాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ ప్లాంటు నుంచి రూ.100 కోట్ల పైచిలుకు విలువైన సామగ్రి చోరీకి గురైనా, పూర్తిస్థాయి విచారణ నిర్వహించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)



- విచారణను అడ్డుకుంటున్న కీలక వ్యక్తులు
- ఖాకీలూ భాగస్వాములై అడ్డుకుంటున్నారనే గుసగుసలు
- రూ.100కోట్ల మేర సొత్తు బయటకు వెళ్లిందనే ఆరోపణలు
- జెన్‌కో, పోలీస్‌బాస్‌లు దృష్టిసారించి పూర్తి విచారణ జరపాలనే డిమాండ్

నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో ఇటీవల జరిగిన దొంగతనాలు పోలీస్ విచారణకే పరిమితమవుతుందే తప్ప, అంతకుమించి లోతుగా జరగడం లేదని స్పష్టమవుతోంది. ఈ దందాను వెనకనుంచి నడిపించి కాసులు పోగేసుకున్న ఖాకీలే విచారణ మందగించడానికి కారణమని తెలుస్తోంది. ప్లాంటులో జరిగిన స్ర్కాప్ దొంగతనాలపై జిల్లా నిఘావిభాగం నుంచి పూర్తిస్థాయి నివేదిక ఉన్నతాధికారులకు సమర్పించినా చర్యలు చేపట్టకుండా రాష్ట్రస్థాయిలో సదరు సూత్రధారుల పెద్దలు అడ్డుకుంటున్నట్లు ఇటు జెన్‌కోలో, అటు పోలీస్ వర్గాల్లో చర్చ సాగుతోంది.

ప్లాంటు శంకుస్థాపన నుంచి తిష్టవేసిన వారే..

పోలీస్, జెన్‌కో వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన వైటీపీఎస్ స్ర్కాప్ కుంభకోణం వెనక జెన్‌కోతోపాటు, పోలీ స్ శాఖలోని అధికారుల పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. ప్లాంటు శంకుస్థాపన సమయం నుంచి ఆ ప్రాంతంలో తిష్టవేసిన అధికారులు ఇందులో భాగస్వాములైనట్లు ఆరోపణలు వస్తున్నాయి. వీరి ప్రమేయంతోనే చోరీ అవుతున్న సామగ్రి పట్టుబడిన సందర్భంలో ఆ కేసును ఆ సంఘటన వరకే పరిమితం చేస్తున్నారని, పూర్తి విచారణ జరగకుండా సదరు పోలీసులు, జెన్‌కో అధికారులు రంగంలోకి దిగి మమ అనిపిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఉన్నతస్థాయిలో ఉన్న తమ పెద్దల ద్వారా వీరు విచారణ ముందుకుసాగకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఆరునెలల క్రితం వెలుగులోకి వచ్చిన ఒక చోరీ సందర్భంలో విచారణ కొనసాగుతుందని పోలీస్‌బాస్ పేర్కొన్నప్పటికీ, విచారణాధికారులు దాన్ని అటకెక్కించారని పేర్కొంటున్నారు. అయితే ఉన్నతాధికారుల సూచనల మేరకు వైటీపీఎస్‌లో స్ర్కాప్ కుంభకోణంపై జిల్లా పోలీ స్ నిఘా విభాగం నుంచి పూర్తి నివేదిక వెళ్లిందని, ఈ కుంభకోణాన్ని వెనకుండి నడిపిన కీలక వ్యక్తులు ఈ నివేదికపై చర్యలు తీసుకోకుండా రాష్ట్రస్థాయిలోనూ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని పోలీస్‌వర్గాల్లో టాక్ కొనసాగుతోంది. జెన్‌కో మాజీ ముఖ్యఅధికారికి సన్నిహితులమని చెప్పుకునే ఒక పోలీసాయన ఈ మొత్తం తతంగాన్ని కొనసాగిస్తున్నారని, ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపిస్తే మొత్తం కుంభకోణం వెలుగులోకి వస్తుందని, పోలీస్ ఉన్నతాధికారులు ఈమేరకు కార్యాచరణ చేపట్టాలనే సూచనలు వస్తున్నాయి.

పటిష్టమైన భద్రతా వ్యవస్థ ఉన్నప్పటికీ..



దాదాపు రూ.40వేల కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం నల్లగొండ జిల్లా వీర్లపాలెం వద్ద యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ని నిర్మిస్తోంది. ప్లాంట్ చుట్టూ సీసీ కెమెరాల నిఘా, పాస్‌లు, అనుమతి పత్రాలుంటేనే ఎవరినైనా, ఏ వాహనాన్నైనా లోపలకు గానీ, బయటకు గానీ అనుమతించేలా కట్టుదిట్టమైన భద్రతా వ్యవస్థ కొనసాగుతోంది. ప్రత్యేకంగా సీఆర్‌ఎఫ్ బలగాలు.. ఇక్కడ ఒక డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో...

- మిగతా 5వ పేజీలో...

'ఆత్మీయభరోసా' కల్పించరూ..

- కొత్తమున్సిపాల్టీలు, విలీన గ్రామాల్లో పథకాన్ని పొందలేకపోతున్నవైనం
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భారీగా పథకాన్ని కోల్పోతోన్న కూలీలు



నల్లగొండ, జనవరి 12 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం తమకూ వర్తింపజేయాలనే డిమాండ్ పట్టణ ప్రాంత వ్యవసాయకూలీల నుంచి బలంగా వినిపిస్తోంది. భూమిలేని వ్యవసాయ కూలీలకు ఈపథకం ద్వారా ఏడాదికి రూ.12వేల ప్రోత్సాహకం అందజేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఈ నెల 26 నుంచి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం కింద లబ్ధిదారులను మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నమోదైన కూలీల ద్వారా (జాబ్‌కార్డులు) గుర్తించాలని ఇటీవల నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ప్రభుత్వం సూచించింది. ఈ పథకంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20రోజులు పనిచేసిన కూలీ కుటుంబా న్నే అర్హత కలిగిన కుటుంబంగా గుర్తించాలని సూచించారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ పట్టణప్రాంతా ల్లో, ప్రధానంగా నూతనంగా ఏర్పాటైన మున్సిపాల్టీల్లో, పెద్ద మున్సిపాల్టీలను విస్తరించే క్రమంలో విలీనం చేసి న గ్రామాల్లో, మున్సిపాల్టీగా మార్చినప్పటికీ వ్యవసాయమే ప్రధానంగా ఉన్న పట్టణాల్లోని వ్యవసాయ కూలీలు తమకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయాల ని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ వ్యాప్తంగా 40 శాతం మేర పట్టణీకరణ జరిగిందని, పౌరసేవల సౌల భ్యం, అభివృద్ధి, సంక్షేమ పథకాలు, స్మార్ట్ పాలన పేరు తో పదివేల జనాభా ఉన్న ప్రాంతాలనూ మున్సిపాల్టీలుగా మార్చారని పేర్కొంటున్నారు. దీంతో తమకు ఒరిగిందేమీ లేకపోగా, కనీస పని గ్యారంటీ కల్పించే ఉపాధి హామీ పథకాన్ని కోల్పోగా, తాజాగా....

- మిగతా 5వ పేజీలో...

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



సాగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

నాగార్జునసాగర్, జనవరి12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అక్రమ అరెస్టులు అప్రజాస్వామికమని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన సాగర్ హిల్‌కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయంలపై కాంగ్రెస్ కార్యకర్తల దాడికి నిరసనగా కార్యాలయాన్ని పరిశీలించడానికి వెళ్తున్న బీఆర్‌ఎస్ నేతలను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తయినప్పటికీ రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడటంలో విఫలమయ్యారన్నారు. హైడ్రా,మూసీ పరిరక్షణ పేరుతో పేదల నివాసాలను కూల్చి వేస్తున్నారన్నారు. లగచర్లలో అమయాకులైన గిరిజనులపై కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. ఆయనవెంట బీఆర్‌ఎస్ నాయకులు రమేష్‌జీ, చంద్రమౌళి, హలీం, శేఖరాచారి, సైదులు, అర్జున్, జిలానీ, ముత్తయ్య ఉన్నారు.


కన్నుల పండువగా ఎదుర్కోలు

సంప్రదాయబద్ధంగా గోదా రంగనాయకస్వామికి పూజలు



నల్లగొండలోని రామాలయంలో ఎదుర్కోలు మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

నల్లగొండ కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస వ్రత మహోత్సవంలో భాగంగా ఆదివారం రాత్రి నల్లగొండ పట్టణంలోని పలు దేవాలయాల్లో స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం సాంప్రదాయరీతిలో నిర్వహించారు. రామగిరిలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో గోదాదేవి, రంగనాయక స్వాముల ఎదుర్కోలు మహోత్సవాన్ని అర్చకస్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారు, స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి వేర్వేరుగా వాహనాలపై ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రజలు, భక్తుల సమక్షంలో శాస్త్రోక్తంగా నిశ్చితార్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. భాష్యం జగన్నాథాచార్యుల ఆధ్వర్యంలో రంగనాథస్వామిని వరించేందుకు గోదాదేవి వ్రత పూజను భక్తులకు వివరించారు. స్వామి వారి ఎదుర్కోలు మహోత్సవం చూడముచ్చటగా సాగింది. రంగనాయకస్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని సోమవారం రాత్రి 7గంటలకు నిర్వహించేందుకు నిశ్చయించినట్లు అర్చకులు తెలిపారు. స్వామి, అమ్మవా రి తరఫున శఠగోపాలాచార్యులు, యాదగిరాచార్యులు తదితరులు వ్యవహరించారు. నేడు జరిగే గోదా రంగనాయకస్వాముల తిరు కల్యాణ మహోత్సవానికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరుకానున్నారని ఆలయ ఈవో జయ రామయ్య తెలిపారు. కార్యక్రమంలో నల్లగొండ మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ ఈవో జయ రామ య్య, చకిలం వేణుగోపాల్‌రావు, సంధ్యారాణిలతోపాటు వికాస తరంగిణి సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పానగల్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో, వీటీ కాలనీలోని శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎదుర్కోలు కార్యక్రమం కన్నుల పండువగా సాగింది.





ప్రత్యేక అలంకారంలో ఉత్సవ మూర్తులు

కల్యాణానికి ముస్తాబైన ఆలయాలు

ధనుర్మాస వ్రత మహోత్సవం చివరిరోజు సందర్భంగా పట్టణంలోని పలు దేవాలయాల్లో జరిగే శ్రీ గోదా రంగనాయక స్వాముల తిరు కళ్యాణ మహోత్సవానికి ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి. భక్తుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. ఆలయాలన్నీ విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. జిల్లాకేంద్రంలోని రామగిరిలోగల రెండో భద్రాద్రిగా పేరొందిన సీతారామచంద్ర స్వామి దేవాలయం కల్యాణానికి సర్వం సిద్ధమైంది. కల్యాణ వేదికను అందంగా తీర్చిదిద్దారు. హాజరయ్యే భక్తుల కోసం ప్రత్యేక వసతులు కల్పించారు. మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి కల్యాణ నిర్వహణ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.



జిల్లాకేంద్రంలో మరియమాత తిరునాళ్లకు ముస్తాబైన చర్చి



విద్యుద్దీపాల వెలుగుల్లో చర్చి ప్రధాన ద్వారం

మరియమాత తిరునాళ్లకు ముస్తాబు

నేటి నుంచి మూడు రోజులపాటు మరియమాత తిరునాళ్లు కొనసాగనున్నాయి. ఈ వేడుకల కోసం జిల్లాకేంద్రంలోని మరియమాత చర్చిని అందంగా ముస్తాబు చేశారు. ఆదివారం రాత్రి విద్యుద్దీపాల అలంకరణలో చర్చి మంత్రముగ్ధుల్ని చేస్తోంది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

కొనసాగిన వాహనాల రద్దీ

● టోల్‌గేట్ల వద్ద బారులు ● వేలాదిగా తరలిన వాహనాలు



చౌటుప్పల్ హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి నుంచి వెళ్తున్న వాహనాలు

చౌటుప్పల్ టౌన్, చౌటుప్పల్ రూరల్, కోదాడ రూరల్, బీబీనగర్, కేతేపల్లి, చిట్యాలరూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగుతోంది. సంక్రాంతి పండుగకు ప్రజలు పట్టణాల నుంచి పల్లెలకు బయలుదేరారు. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలకు బయలుదేరిన వారితో ఆదివారం కూడా రహదారులపై వాహనాల రద్దీ నెలకొంది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని 65వ నెంబరు జాతీయ రహదారిపై వేలాదిగా వాహనాలు బయలుదేరాయి. పట్టణంలోని జంక్షన్‌ల వద్ద తప్ప మరో చోట హైవేను దాటలేని పరిస్థితి నెలకొంది. జంక్షన్‌ల వద్ద ట్రాఫిక్ పోలీసులు వాహనాలను క్రమబద్ధీకరిస్తూ ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ విజయ్‌మోహన్ తెలిపారు. చౌటుప్పల్ మండలంలో జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు వాహనాలు బారులు తీరాయి. సొంత ఊర్లకు వెళ్తున్న ప్రజలతో జాతీయరహదారి సందడిగా మారింది. బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలతో ప్రజలు బయలుదేరారు. పంతంగి టోల్‌గేటు వద్ద 16 గేట్లకుగాను 10గేట్ల ద్వారా విజయవాడ వైపు వాహనాలను పంపించారు. పంతంగి టోల్‌ప్లాజా వద్ద సాధారణ రోజుల్లో 35వేలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆదివారం ఒక్క రోజే సుమారు 65వేల వాహనాలు విజయవాడ వైపు వెళ్లాయి. మూడు రోజుల్లో 2.10లక్షల వాహనాలు విజయవాడ వైపు వెళ్లినట్లు డీఆర్‌పీ ఇన్‌ఫ్రా ప్రతినిధులు తెలిపారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌గేట్ వద్ద వాహనాలు బారులు తీరాయి. హైదరాబాద్ వైపునకు ఆరు, విజయవాడ వైపునకు ఆరు కౌంటర్ల ద్వారా టోల్ వసూలు చేస్తున్నారు.

పకడ్బందీ చర్యలు చేపట్టిన పోలీసులు

సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని కొమరబండ వై-జంక్షన్ల వద్ద వాహనాలు రాకపోకలు కొనసాగించేందుకు వీలుగా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఆదివారం ఉదయం కొమరబండ వై-జంక్షన్ వద్ద హైదరాబాద్ నుంచి విజయవాడకు బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని కారు వెనుక నుంచి ఢీకొట్టడంతో అతనికి స్వల్పగాయాలయ్యాయి. అతనిని వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాలకు అంతరాయం కలగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ మండలంలోని రామాపురం క్రాస్‌రోడ్డు వరకు జాతీయ రహదారిపై వాహనాల రద్దీని పరిశీలించారు. టోల్‌ప్లాజా సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం మూడురోజులుగా ఇప్పటి వరకు 1.50లక్షలకు పైగా వాహనాలు హైదరాబాద్ నుంచి ఆంధ్రా వైపు తరలివెళ్లినట్లు తెలిపారు. జాతీయ రహదారి వెంట క్రేన్లు, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచారు. యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద మొత్తం 12టోల్‌గేట్లు ఉండగా వరంగల్ వైపుఉన్న 6గేట్లలో సాయంత్రానికి రద్దీ తగ్గి యథాస్థితిగా వాహనాలు వెళ్లిపోతుండగా ఉదయం నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు వరంగల్ హైవే వైపు మార్గంలో వాహనాల సందడి పెరిగి టోల్‌ప్లాజా వద్ద వాహనాలు బారులుతీరి కనిపించాయి. టోల్ సిబ్బంది టోల్ గేట్ల వద్ద ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో పాటు సిబ్బంది వాహనాలను క్రమ పద్ధతిన ముందుకు పంపించడంతో సాఫీగా వాహనాలు వెళ్లాయి.

ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు

మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ



రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలను పరిశీలిస్తున్న ఐజీ సత్యనారాయణ

కోదాడ రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పండుగకు సొంతూర్లకు వెళ్లేందుకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం సూర్యాపేట జిల్లాసరిహద్దు రామాపురం క్రాస్‌రోడ్డు వరకు జాతీయ రహదారిపై వాహనాల రద్దీని పరిశీలించి పోలీసులకు తగు సూచనలు అందజేశారు. హైదరాబాద్-విజయవాడ రహదారితో పాటు హైద్రాబాద్-వరంగల్ రహదారిపై కూడా వాహనాల రాకపోకలకు అంతరాయం చర్యలు తీసుకుననట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 500 మంది పోలీసులను ఏర్పాటు చేశామన్నారు. ఇద్దరు డీఎస్పీలు, 15 మంది సీఐలు, 30మంది ఎస్‌ఐలు ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నామని, జాతీయ రహదారిపై ప్రతి సర్కిల్ పరిధిలో క్రేన్లు, అంబులెన్సులు ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి ప్రమాదాలు జరిగినా వెంటనే చర్యలు తీసుకునేలా పోలీసులకు ఆదేశాలిచ్చామన్నారు. ఆయన వెంట సీఐలు రామకృష్ణారెడ్డి, రజితారెడ్డి ఉన్నారు.

సంక్రాంతి.. సంబరం

● ఊరూరా డూడూబసవన్నల ఆటలు ● వాడవాడలా హరిదాసుల కీర్తనలు



సంక్రాంతి పండుగ సందర్భంగా సూర్యాపేటలో హరిదాసు, గంగిరెద్దు వేషధారణ

నిడమనూరు, నల్లగొండ కల్చరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంకురాతిరి అని తెలుగువారు పిలుచుకునే మూడు రోజుల పండుగ సంక్రాంతి. నేటి నుంచి జరుపుకునే సంక్రాంతి పండక్కి పల్లెలు ముస్తాబయ్యాయి. ఈ పండుగ అంటే చాలు మహిళలకు, రైతులకు, పిల్లలకు ఎక్కడలేని ఉత్సాహం వస్తుంది. పతంగులు ఎగురవేస్తూ పిల్లల కేరింతలు, లోగిళ్ల ముంగిట మహిళలు వేసే రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలు, ఇంటి నిండా ధాన్యపు రాశులు, భోగి మంటలు, డూడూబసవన్నల (గంగిరెద్దులు) ఆటలు, హరిలో రంగ హరి అంటూ హరిదాసుల సంకీర్తనలు ఇవన్నీ సంక్రాంతి అనగానే ఇట్టే గుర్తుకు వస్తాయి. పండుగలన్నింటిలో సంక్రాంతికి ఎంతో ప్రత్యేకత ఉంది. తెలుగు ప్రజలు మూడు రోజుల పాటు ఎంతో ఘనంగా జరుపుకునే పండుగ సంక్రాంతి. మొదటి రోజున భోగి, రెండో రోజు మకర సంక్రాంతి, మూడో రోజు కనుమ జరుపుకుంటారు. తమ జీవితాల్లో సంక్రాంతి కొత్త కాంతి నింపుతుందని తెలుగు ప్రజలు భావిస్తారు. ముఖ్యంగా పల్లె ప్రాంతాల్లో సంక్రాంతి సంబరాలు కన్నుల పండువగా జరుగుతాయి. రైతుల పండుగ అయిన సంక్రాంతికి ధాన్యం ఇంటికి వచ్చిన సంతోషంలో పండుగ జరుపుకోవడం ఆనవాయితీ. తెలుగు వారి సాంప్రదాయ పండుగల్లో సంక్రాంతి ఒకటి కావడంతో ప్రజలు స్థోమతకు అనుగుణంగా పండుగను జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. పట్టణాల్లో నివాసం ఉండేవారు సైతం పండుగకు సొంత గ్రామాలకు చేరుకున్నారు. ప్రతి ఇల్లూ బంధువులు, కుటుంబసభ్యులతో కళకళలాడుతుంటుంది. ప్రతి ఇంటా అరిసెలు వంటి పిండి వంటలు చేసుకోవడం సంక్రాంతి సాంప్రదాయం. నూతన వస్త్రాలు ధరించి పండుగ నాడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి తమ ఆశలు, ఆశయాలు నెరవేరాలని భగవంతున్ని కోరుకుంటారు. ఈ నెల 13 భోగి, 14న మకర సంక్రాంతి, 15న కనుము పండుగలను జరుపుకోనున్నారు.

గంగిరెద్దుల ఆటలు ప్రత్యేకం

పండుగకు ముందు నుంచే జంగాలవారు గ్రామాల్లో గంగిరెద్దులను ఆడిస్తుంటారు. గంగిరెద్దుల ఆటలు ఎంతో ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి. వారు శిక్షణ ఇచ్చిన ఎద్దులకు రకరకాల వస్త్రాలతో ముచ్చటగా అలంకరించి, కాళ్లకు గజ్జెలు కట్టి ముస్తాబు చేస్తారు. వీధులన్నీ తిరుగుతూ డోలు వాయిస్తూ సన్నాయి ఊదుతూ గంగిరెద్దులను ఆడించేవారు. డూడూ బసవన్నల ఆటలు పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరినీ అలరిస్తాయి.

వాడవాడలా హరిదాసుల కీర్తనలు

భాగవతులుగా పేరుగాంచిన హరిదాసులు తలపై అక్షయపాత్ర, చేతిలో తంబురా పట్టుకొని హరిలో రంగ హరి అంటూ హరినారాయణుడి నామాన్ని స్మరిస్తూ సంకీర్తనలు ఆలపిస్తుంటారు. ప్రజలు కూడా హరిదాసుకు తోచినంత సాయం చేసి ఆశీర్వాదం పొందుతారు. పండుగనాడు హరిదాసుల ఆశీర్వాదం తీసుకుంటే శుభం జరుగుతుందని భావన. మకర సంక్రాంతి నాడు అయ్యప్ప స్వాములు మకరజ్యోతిని దర్శించుకుంటారు.

యువత క్రీడల్లో రాణించాలి : మంత్రి కోమటిరెడ్డి



కేవీఆర్‌కప్ సీజన్-1 క్రికెట్ పోటీల విజేతకు బహుమతి అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

నల్లగొండ స్పోర్ట్స్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): యువత ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో ఆదివారం కేవీఆర్‌కప్ సీజన్-1 క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. విద్యార్థులు, యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మానసిక ఆనందంతో పాటు శారీరక ధృడత్వం ఏర్పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గచ్చిబౌలిలో స్పోర్ట్స్ యూనివర్సిటీకి శ్రీకారం చుట్టిందన్నారు. అనంతరం ఎమ్మెల్యేలు బాలునాయక్, బీర్ల ఐలయ్య, బత్తుల లక్ష్మారెడ్డి, కుంభం అనిల్‌రెడ్డిలతో కలిసి క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన ఎన్‌కేఎల్ జట్టుకు షీల్డ్, రూ.1,00,116లు నగదు బహుమతి, ద్వితీయ స్థానంలో నిలిచిన స్టార్ లెవన్ జట్టుకు షీల్డ్, రూ.50,116లు నగదు బహుమతి, తృతీయ స్థానంలో నిలిచిన కేఆర్‌యూ జట్టుకు షీల్డ్, రూ.30వేల నగదు, నాలుగో స్థానంలో నిలిచిన జట్టుకు షీల్డ్, రూ.20వేలు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, నాయకులు బొడ్డుపల్లి లక్ష్మి, వంగూరి లక్ష్మయ్య, దుబ్బ రూప, నాగరత్నం రాజు, నంద్యాల వీరబ్రహ్మానందారెడ్డి, రాకేష్, నరేందర్, సాయి పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ విజేత సూర్యాపేట జిల్లా



వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతగా నిలిచిన సూర్యాపేట జిల్లా క్రీడాకారులు

కోదాడటౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని తేజ టాలెంట్ స్కూల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. రెండో రోజు 12జిల్లాల నుంచి 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 120టాప్ ఛాంపియన్ షిప్ యూత్ జూనియర్, సీనియర్ విభాగం మెన్‌లో మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. మహిళల విభాగంలో సూర్యాపేట జిల్లా విజేతగా నిలిచింది. వీరితో పాటు ఉత్తమ వెయిట్ లిఫ్టర్ యూత్ ఉమెన్ విభాగంలో ఖమ్మం జిల్లాకు చెందిన ఏతోని శ్రీ, జూనియర్ సీనియర్ విభాగంలో సీహెచ్ అనూష్ మేడ్చల్, మల్కాజ్‌గిరి, పురుషుల బెస్ట్ వెయిట్ లిఫ్టింగ్ యూత్‌లో ఖమ్మంకు చెందిన కే. అభిరామ్, జూనియర్ సీనియర్‌లో కె. మోహన్ బెస్ట్ వెయిట్ లిఫ్టర్లుగా నిలిచారు. విజేతలకు కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత విద్యతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం ఉంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. తెలంగాణ రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పాలడుగు ఖ్యాతి మాట్లాడుతూ రెండురోజుల పాటు కోదాడలో పోటీలు నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేకల వెంకట్రావు, ఎస్‌ఆర్‌కే మూర్తి, దేవబత్తిని నాగార్జున, కోటిరెడ్డి, వేనేపల్లి శ్రీనివాసరావు, ఆకుల శ్రీనివాస్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు పుల్లారావు, జానకి రామయ్య, హనుమంతరాజు, శివకృష్ణమూర్తి, శ్రీనివాస్, గణేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగింతలు, అరెస్టులు, ఆందోళనలు

● భువనగిరిలో హైటెన్షన్ ● మహాధర్నాకు బీఆర్‌ఎస్ పిలుపు ● పోలీసుల కన్నుగప్పి ధర్నాకు దిగిన బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యేలు



భువనగిరిలో నినాదాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ కార్యకర్తలు

భువనగిరి టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపై యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలు, ప్రతిగా యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ కార్యకర్తలు బీఆర్‌ఎస్ కార్యాలయంపై దాడిచేసిన ఘటన నేపథ్యంలో రెండోరోజు ఆదివారం జిల్లాలో ఉద్రిక్తత కొనసాగింది. దాడిని ఖండిస్తూ జిల్లాకేంద్రం భువనగిరిలో బీఆర్‌ఎస్ మహాధర్నాకు పిలుపునిచ్చిన నేపథ్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆ పార్టీ నాయకులను, కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ వ్యూహ ప్రతి వ్యూహాలు, పోలీసుల భారీ భద్రతా, భారీ కేడింగ్స్, రహదారులపై ప్రజల రాకపోకలపై పోలీసుల ఆంక్షలతో ఒక రకంగా జిల్లాకేంద్రం పోలీసు వలయాన్ని తలపించింది. ఉమ్మడి జిల్లాలోని మాజీ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలందరూ పాల్గొంటున్నారని కార్యకర్తలు మహాధర్నాకు తరలి రావాలని ఆ పార్టీ నాయకులు సమాచారం చేరవేశారు. వినాయక చౌరస్తా వద్ద ధర్నాకు అనుమతి లేదని శనివారం అర్ధరాత్రి నుంచే జిల్లాఅంతటా బీఆర్‌ఎస్ నాయకులను, కార్యకర్తలను పోలీసులు, అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. పట్టణ ప్రధాన రహదారులైన నల్లగొండ, వరంగల్, జగదేవ్‌పూర్ రోడ్డు, బైపాస్ రోడ్డుతో పాటు పట్టణంలోని అన్ని చౌరస్తాలు, ప్రధాన అంతర్గత రహదారులపై ఆదివారం పికెటింగ్ ఏర్పాటు చేశారు. డీసీపీ ఎం. రాజేష్‌చంద్ర, అడిషనల్ డీసీపీలు లక్ష్మీనారాయణ, వినోద్, ఏసీపీ కె. రాహుల్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ బందోబస్తును పర్యవేక్షించారు.

ఇరు పార్టీల కార్యకర్తల నినాదాలు

ఉదయం నుంచి పోలీసులు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉన్నప్పటికీ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అనుచరులతో కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట అకస్మాత్తుగా ధర్నాకు దిగారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి కాలికి గాయమైంది. అదేసమయంలో స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పించేందుకు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అనుచరులతో వచ్చారు. దీంతో ఇరు పార్టీల కార్యకర్తలు నినాదాలు చేశారు. ఎమ్మెల్యే నివాళులర్పించి వెనుదిరిగిన వెంటనే బీఆర్‌ఎస్ నాయకులను, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కర్నె ప్రభాకర్, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, జడ్పీ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి,



పోలీసులతో సందీప్‌రెడ్డి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి వాగ్వాదం

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని వేర్వేరు పోలీసుస్టేషన్లకు తరలించారు. మిగతా వారిని జిల్లాలోని వేర్వేరు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అనంతరం కంచర్ల రామకృష్ణారెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి దిష్టిబొమ్మలను కాంగ్రెస్ కార్యకర్తలు దహనం చేశారు. శనివారం జరిగిన ప్రెస్‌మీట్‌లో సీఎంను దూషించిన బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డితో పాటు పలువురు ఆ పార్టీ నాయకులు, బీఆర్‌ఎస్ కార్యాలయంపై దాడి చేసిన యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు



భువనగిరిలో ప్రధాన రోడ్డులో పోలీసులు ఏర్పాటు చేసిన కంచె

తప్పంతా బీఆర్‌ఎస్ నాయకులదే : ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంపై యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ కార్యకర్తలు దాడి చేయడం వెనుక బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి పట్ల చేసిన తీవ్ర వ్యాఖ్యలే కారణమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. భువనగిరిలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సింగిల్ విండో ఎన్నికల్లో కూడా సక్రమంగా గెలువని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తన స్థాయికి మించి సీఎంపై వ్యాఖ్యలు చేశారని, దీంతో సహించలేని తమ పార్టీ కార్యకర్తలు బీఆర్‌ఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలిపేందుకు వెళ్లగా ఆ పార్టీ నాయకులు మరోమారు రెచ్చగొట్టేలా మాట్లాడారని దీంతో సమన్వయం కోల్పోయిన ఒకరిద్దరు బీఆర్‌ఎస్ కార్యాలయంపై దాడి చేశారన్నారు. ఏ ఉద్యమం చేయకుండా, ఏ పార్టీ జెండా పట్టకుండా ఎమ్మెల్యేగా గెలిచి పదేళ్ల పాటు పదవిని అనుభవించిన పైళ్ల శేఖర్‌రెడ్డి మూడోసారి ఎన్నికల్లో ఓడిపోయిన వెంటనే ప్రజలకు, ఆ పార్టీ కార్యకర్తలకు దూరంగా వెళ్లిపోయారని దీంతో కనుమరుగవుతున్నట్లు భయపడి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డితో కాంగ్రెస్ కార్యకర్తలను రెచ్చగొట్టేలా మాట్లాడించి ప్రజల్లో ఉనికి పొందేందుకు చేసిన కుట్ర ఫలితమే ఈ పరిణామాలన్నారు. బీఆర్‌ఎస్ పాలనలోనే నయీం అరాచకాలు కొనసాగాయని నేటికీ ఆ ముఠాకు చెందిన పలువురు భువనగిరి మునిసిపల్ బీఆర్‌ఎస్ కౌన్సిలర్లుగా, ఆ పార్టీ నాయకులుగా ఉన్నారని ఆరోపించారు. శాంతి భద్రతల పరిరక్షణకు, నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కృషిని ఓర్వలేకే బీఆర్‌ఎస్ నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ నాయకుల భూ కబ్జాలను బహిర్గతం చేస్తామని, ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందన్నారు. ఈ సమావేశంలో మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ. అవేజ్ చిస్తీ, పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్ సభ్యుడు తంగెళ్లపల్లి రవికుమార్, మాజీ చైర్మన్ బర్రె జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ సెగ

● రాజకీయ పార్టీల మధ్య విమర్శల హోరు.. ఆందోళనల జోరు

● ఘాటైన విమర్శలతో రాజకీయ అలజడి ● దాడుల వరకూ వెళ్తున్న వైనం

యాదాద్రి, జనవరి12 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలు ముగిసి సంవత్సరం గడిచింది. కాంగ్రెస్ సంబురాలు చేసుకుంటుండగా... బీఆర్‌ఎస్, బీజేపీలు కాంగ్రెస్ హామీలపై ఎదురుదాడికి దిగుతున్నాయి. ఈ మధ్యకాలంలో బీఆర్‌ఎస్ దూకుడు పెంచింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు చేయడంలేదని ఆ పార్టీ నాయకులు ఘాటైన విమర్శలు చేస్తున్నారు. ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని విమర్శిస్తున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షాలకు దీటుగా సమాధానం చెప్పేందుకు ప్రయత్నం చేస్తోంది. రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, తదితర సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందడంలేదని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతిపక్ష పార్టీలు బీఆర్‌ఎస్, బీజేపీలు సన్నాహాలు చేస్తున్నాయి. అయితే సంవత్సరం అమలైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రచారం చేసుకునేలా కాంగ్రెస్ ముందుకు సాగుతోంది. జనవరిలో సర్పంచులు, అనంతరం జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలకు నోటిఫికేషన్ వస్తుందని విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. ఈనేపథ్యంలో స్థానికంగా రాజకీయ పార్టీలు తమ సత్తా చాటేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. రాజకీయ పార్టీలు చేసుకునే విమర్శలు దాడులకు వెళ్లే పరిస్థితి వరకు చేరుకున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే రాజకీయ పరిస్థితులు ఇలా ఉంటే.. వరుస ఎన్నికలతో జిల్లాలో రాజకీయం ఎంత వేడెక్కుతోందోనని స్థానికంగా పెద్దఎత్తున చర్చ జరుగుతోంది.

భువనగిరిలో రాజకీయ సెగ...

రాజకీయ పార్టీలు విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకోవడం సాధారణం. ఏదైనా సంఘటనలు జరిగిన సందర్భంలో ఆయా పార్టీలు చేపట్టిన కార్యక్రమాలు, రాజకీయ నేతలు చేసే వ్యాఖ్యలపై ఖండన చేయడం సహజం. ఈ మధ్య కాలంలో రాజకీయ పార్టీల నేతలపై విమర్శలు వ్యక్తపరుచగానే పార్టీల కార్యాలయాలపై దాడులు వంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల కాంగ్రెస్ నేతలపై బీజేపీ వ్యాఖ్యలకు నిరసనగా నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఎదుట కాంగ్రెస్ యువజన నేతలు ఆందోళన చేసిన సంఘటన విదితమే. భువనగిరిలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు పైళ్ల శేఖర్‌రెడ్డి, కంచర్ల రామకృష్ణారెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ యువజన సంఘం నేతలు బీఆర్‌ఎస్ కార్యాలయంపై దాడికి దిగారు. ఫర్నిచర్ ధ్వంసం చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డితోపాటు పార్టీలోని నేతలు, కార్యకర్తలతో పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. దాడులకు వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష పార్టీలన్నీ కూడా ఖండించాయి. కావాలనే కాంగ్రెస్‌పై రెచ్చగొట్టే విధంగా బీఆర్‌ఎస్ నేతలు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ అంటుండగా, ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై బరాబర్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని బీఆర్‌ఎస్ సవాల్ విసురుతోంది. ఇరు పార్టీల పోటాపోటీ ధర్నాలు, నిరసనలతో భువనగిరిలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.

ఆలేరులో సవాళ్లు.. ప్రతిసవాళ్లు

ఆలేరు నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు ఉప్పు, నిప్పులా మారాయి. ప్రభుత్వ విప్, తాజా మాజీ ప్రభుత్వ విప్ మధ్య ఆరోపణల యుద్ధం కొనసాగుతోంది. ఒకరి ఒకరు నిత్యం విమర్శలు వ్యక్తం చేసుకుంటున్నారు. ఆలేరు నియోజకవర్గంలోని యాదగిరిగుట్ట సబ్‌రిజిస్ట్రార్ సస్పెన్షన్ కావడానికి స్థానిక ఎమ్మెల్యే కారణమంటూ, ఎమ్మెల్యే ఒత్తిడితోనే వందల డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేశారని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఆరోపించగా.. తాము ఎలాంటి అక్రమాలు చేయలేదని, నిరూపిస్తే ఎమ్మెల్యేకు రాజీనామా చేస్తానని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సవాల్ విసిరారు. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడంతో ఆలేరు నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండటంతో ఇరు పార్టీల నేతలు క్షేత్రస్థాయిలోకి వెళ్తున్నారు. స్థానికంగా పట్టు సాధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇరు పార్టీల నేతల మధ్య రాజకీయ విమర్శల హోరు కొనసాగుతోంది.

కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు

● ఉదయం శ్రీరాముడిగా, సాయంత్రం తిరు వేంకటపతిగా నృసింహుడి అలంకరణ



యాదగిరిగుట్ట తిరువీధుల్లో పారాయణాలు చేస్తున్న పారాయణికులు

భువనగిరి అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి వారి దివ్యక్షేత్రంలో ఆదివారం అధ్యయనోత్సవాలు వైభవంగా కొనసాగాయి. ఉదయం వేళ శ్రీరాముడిగా స్వామికి దివ్య ప్రబంధ పారాయణాలు, సాయంత్రం వేళ తిరు వేంకటపతి అలంకరణలో ద్రావిడ ప్రబంధ పారాయణాలు పఠిస్తూ ఉత్సవాలను ప్రధానార్చకులు నల్లందీఘల్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటాచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో ఆలయ ఈవో ఏ.భాస్కర్ రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, ఏఈవో నవీన్, పర్యవేక్షకులు రాజన్‌బాబు, రామరావు, మహేష్, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

యాద'గిరి'పై భక్తుల రద్దీ

స్వామివారి దర్శనార్థం వచ్చిన భక్తులతో యాదగిరికొండ రద్దీగా మారింది. ఆదివారం వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వాహనాలపై తరలివచ్చారు. 45వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ధర్మ దర్శన క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ప్రత్యేక దర్శనాలకు అరగంట, ధర్మదర్శనాలకు గంట సమయం పట్టింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.50,74,808 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర రావు తెలిపారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

గర్భాలయంలో కొలువుదీరి స్వయంభువులను సుప్రభాత సేవతో మేల్కొలిపిన అర్చకులు ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చించి సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో ఉదయం, సాయంత్రం నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడు మ వైభవంగా నిర్వహించారు. శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేతా రామలింగేశ్వరస్వామికి మహామడపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. సంగీత, సాహిత్య, ధార్మిక సభల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మైత్రేయ కూచిపూడి కళాక్షేత్రం (సుభాష్, జనగాం) కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులకు ఆకట్టుకుంది.

నేడు గోదాదేవి కల్యాణం

స్వామివారి ఆలయంలో ఈ నెల 13న శ్రీరంగనాథుడు గోదాదేవి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. గత నెల 16 నుంచి ధనుర్మాసోత్సవాలు ఈ నెల 14 వరకు ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం గోదాదేవి పరిణయం, 14న ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.



గర్భాలయంలో ఉభయ క్యూలైన్లలోభక్తుల రద్దీ

అనర్హులకు రైతు భరోసా అందకూడదు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వేదికపై మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అయ్యిలయ్య,ఎమ్మెల్యేలు బాలు నాయక్, వీరేశం, పద్మావతి, బీఎల్‌ఆర్, సామేలు,జైవీర్‌రెడ్డి కలెక్టర్లు

నల్లగొండ టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అర్హులం దరికీ రైతు భరోసా అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, జిల్లా ఇన్ చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో ఆదివారం ఉదయాదిత్యాభవన్‌లో ఆయన రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తో కలిసి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు మంజూరుపై ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అధికారులు, శాసనసభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు సమన్వయం చేసుకుంటూ క్షేత్ర స్థాయి పర్యటనలు చేసి రెవెన్యూ గ్రామాల వారీగా రికార్డులు పరిశీలించి గ్రామ పంచాయతీ వారీగా గ్రామ సభలు నిర్వహించి భూమి లేని వారిని, భూ సేకరణ చేసిన భూములు, గుట్టలను, లే అవుట్ల, నాలా కన్‌వర్షన్ చేసిన భూములను గుర్తించి వారి పేర్లను రైతు భరోసా పథకం నుంచి తొలగించాలన్నారు. ప్రజా ప్రభుత్వంలో ఒక్క సంవత్సరం కాలంలోనే రూ. 40 వేల కోట్లతో రైతు సంక్షేమం చేపట్టినట్లు చెప్పారు. ఈనెల 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డులు మంజూరు లాంటి పథకాలు ప్రారంభిస్తామన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి : మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వంలో ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చామని అధికారులు విధులు బాధ్యతతో నిర్వహించాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూచించారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో నల్లగొండ నియోజకవర్గంలో 797 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మాత్రమే ఇచ్చారని కానీ ఇప్పటివరకు లబ్ధిదారులకి ఇవ్వలేదని కానీ ఈ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఏడాది నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసి పేద వారి ఇంటి కల నెరవేరుస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గ్రామ సభల ద్వారా గుర్తించి మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. ఆర్థికవేత్త, దివంగత మన్మోహన్ సింగ్ ఆలోచనతో రూపొందించినఉపాధి హామీ పథకం భూమి లేని కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయభరోసా కింద రెండు విడతల్లో రూ. 12వేల ఇస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ముగ్గురు కలెక్టర్లు బాగా పనిచేస్తారని వారికి అధికారులు సహకరించి పేదల సంక్షేమం కోసం ఏ ఒక్క అర్హుడిని కూడా వదలకుండా అన్ని పథకాలు అందేలా చూడాలని అలాగే నల్లగొండ జిల్లాను ప్రథమ స్థానంలో ఉండేలా చూడాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, శాస న సభ్యులు బాలునాయక్, నల్లమాద ఉత్తమ్ పద్మావతిరెడ్డి, వేముల వీరేశం, మందుల సామేలు, జైవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, నల్లగొండ, యాద్రాది భువనగిరి, సూర్యాపేట జిల్లా కలెక్టర్లు ఇలా త్రిపాఠి, హన్మంతరావు, తేజస్ నం ద్ లాల్ పవార్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, ఉమ్మడి జిల్లా అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులు, పంచాయతీ రాజ్ గ్రామీణభివృద్ధి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు రైతు భరోసా

● శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



సేద్యానికి యోగ్యమైన ప్రతి ఎకరానికి రైతు భరోసా కింద రూ. 12వేలు ప్రభుత్వం అందజేస్తుందని రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ. ఇందిరమ్మ ఆత్మీయ భరో సా ద్వారా భూమి లేని కూలీలకు ఏడాది రూ. 12 వేలు అందజేస్తానమని లబ్ధి దారులను జాగ్రత్తగా గుర్తించాలన్నారు. భూమి లేకుండా చాలా మందికి పాస్ బుక్‌లు మంజూరు చేసారని వాటిని అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి వారి ని రైతు భరోసా నుంచి తొలగించాలని అధికారులకు సూచించారు. తలసరి ఆదా యంలో సిక్కిం తర్వాత తెలంగాణ నే ముందంజలో ఉద న్నారు. కానీ రేషన్ కార్డు దరఖాస్తులు చాలా వచ్చాయని వాటిని క్షేత్రస్థాయి లో పరిశీలిస్తూ అర్హులకు మాత్రమే నూతన కార్డులు జారీ చేయాలని సూచించారు.

పవర్‌ప్లాంట్ స్క్రాప్ కుంభకోణంపై నీలినీడలు

(3వ పేజీ తరువాయి)

భద్రత కొనసాగిస్తుంటే, మరో వైపు సివిల్ పోలీసులు తమ పర్యవేక్షణను ఏర్పాటుచేశారు. పైగా జెన్‌కో విజిలెన్స్ కార్యాలయం ఇక్కడే ఏర్పాటుచేసింది. ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఇక్కడ విజిలెన్స్ విభాగాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఇంత పటిష్టమైన భద్రత ఉన్న ప్రాంతంలో చిన్న బోల్ట్ పట్టుకోవాలన్నా సామాన్యులకు వెన్నులో వణుకుపుడుతుంది. అయితే ఇక్కడ భారీగా ఇనుము, అల్యూమినియం, పాత ఇనుము, రాగి, ఉక్కు, వినియోగించిన తర్వాత వదిలేసే తుక్కు పెద్ద ఎత్తున చేరుతుండడంతో దీనిపై కన్నేసిన కొందరు అక్రమార్కులు వీటిని బయటకు తరలించి సొమ్ముచేసుకునేందుకు రంగంలోకి దిగారు. ఇక్కడ పనిచేసే కీలకమైన స్థాయిలో ఉన్న జెన్‌కో సిబ్బంది, బీహెచ్‌ఈఎల్‌కు చెందిన సిబ్బంది, కాంట్రాక్ట్ సంస్థల సిబ్బందితో పాటు, ఇక్కడ శంకుస్థాపన సమయం నుంచి కాచుకొని ఉన్న ఒక పోలీస్ అధికారి, భద్రతా విధుల్లో ఉండే వీరికి సానుకూలమైనవారు ఒక బృందంగా ఏర్పడి, బయట రాజకీయ పలుకుబడి, అధికార వర్గాల్లో చెలామణి అయ్యేవారితో కలిసి ఈ అక్రమ దందాను కొనసాగించారన్న ఆరోపణలున్నాయి. ఇక్కడ పనిచేసే కార్మికులను, ఈ ప్లాంటులోకి వచ్చే వాహనాల డ్రైవర్లు, కూలీలను, కాంట్రాక్ట్ సంస్థల్లో పనిచేసే వారిని ఇక్కడినుంచి ఇనుమును బయటకు తీసుకెళ్లేందుకు వినియోగించి ప్లాన్ ప్రకారం ఈ దొంగతనాలు నిర్వహిస్తున్నట్లు చర్చ సాగుతోంది. కూలీలు, వాహనాల డ్రైవర్లు, ఆ దొంగతనంలో పట్టుబడిన వారికే కేసుని పరిమితం చేస్తున్నారే తప్ప ఈ దొంగతనాలకు మూలమైన కీలక వ్యక్తులను గుర్తించినా, ఎందుకు విచారించడం లేదనే ప్రశ్నలకు సమాధానం కొరవడింది.

సమగ్రవిచారణకు డిమాండ్

పవర్‌ప్లాంటులో స్క్రాప్ కుంభకోణంలో జెన్‌కో, పోలీస్ సహా ఇతర విభాగాల అధికారులు, ఉద్యోగులపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఈ మొత్తం కుంభకోణంపై పూర్తిస్థాయి విచారణ నిర్వహించాలనే డిమాండ్ వెలువడుతోంది. నిఘా విభాగాలు నివేదికలిచ్చినా, ఉన్నతాధికారులు స్పందించకపోవడం వెనక ఒత్తిళ్లున్నాయనే విమర్శలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని, జెన్‌కోతోపాటు పోలీస్ ఉన్నతాధికారులు ఈ స్క్రాప్ కుంభకోణంపై పూర్తి విచారణకు ఆదేశించి వాస్తవాలను బహిర్గతం చేయాలనే డిమాండ్ వెలువడుతోంది.

రేషన్‌బియ్యం పట్టివేత

దేవరకొండ,జనవరి12(ఆంధ్రజ్యోతి): బొలేరోలో అక్రమంగా తరలిస్తున్న 30 క్విం టాళ్ల రేషన్‌బియ్యాన్ని ఆదివారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. స్థానిక కల్వకుర్తి రోడ్డులో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునూతల మండలం లబ్ధిపూర్ గ్రామానికి చెందిన నేనావత్ హరి బొలేరోలో దేవరకొండ పట్టణంలోని వినియోగదారుల వద్ద రేషన్‌బియ్యాన్ని కొనుగోలు చేసితరలిస్తుండగా పట్టుకొని వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు. పట్టుబడిన రేషన్‌బియ్యాన్ని సివిల్ సప్లయ్ డీటీఎస్ హనుమంతు శ్రీనివాస్‌గౌడ్‌కు సమాచారం అందించగా పంచనామా నిర్వహించినట్లు తెలిపారు. హరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు .

శాస్త్రీయంగా లక్ష్మీ నర్సింహుడి కల్యాణం

మఠంపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మట్టపల్లి మహాక్షేత్రంలో హరిహరుల ఆలయాల్లో శివకేశవులకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. పుష్పాలంకరణ పూర్తయ్యాక లక్ష్మీనరసింహుడికి అష్టోత్తర నామార్చనలు, ఉపాలయాల్లోని పరివార దేవతలకు ప్రాబోధినివేదనలు చేశారు. శ్రీ గోదాదేవి సన్నిధిలో రాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనృసింహుడికి నిత్యకల్యాణోత్సవాన్ని యాజ్ఞికులు వేద మంత్రోచ్ఛరణలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరివిజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండనవీన్. తూమాటిశ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణామాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, నరసింహామూర్తి, లక్ష్మీనరసింహామూర్తి, సీతారామశాస్త్రీ, శేషగిరిరావు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పారిపోయిన విద్యార్థి తల్లిదండ్రుల చెంతకు



తండ్రి రాములుతో నాని

యాదగిరిగుట్ట రూరల్, జనవరి 12, (ఆంధ్రజ్యోతి): హాస్టల్ నుంచి పారిపోయిన విద్యార్థి నెలరోజుల అనంతరం తల్లిదండ్రుల చెంతకు చేరాడు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొంగ జిల్లా కేంద్రానికి చెందిన చిలుకల రాములు రేణుక దంపతుల కుమారుడు నాని తిపర్తి మండలంలోని రెసిడెన్షియల్ పాఠశాలలో హాస్టల్‌లో ఉంటూ ఏడో తరగతి చదువుతున్నాడు. గత డిసెంబరు 4వ తేదీన తల్లిదండ్రులు ఇంటివద్ద నున్న తన కుమారుడు నానిని తీసుకొని వెళ్లి హాస్టల్‌లో వదివెళ్లిపోయారు. అదే నెలలో డిసెంబరు 6న హాస్టల్ నుంచి నేరుగా నల్లగొండ పట్టణానికి చేరుకున్నాడు. మెదక్ జిల్లా గజ్వేల్‌కు చెందిన తాపీ మేస్త్రి గణేష్, రేణు దంపతులకు తారసపడ్డాడు. దీంతో నానిని తీసుకుని రెండు రోజులు తిరుపతికి వెళ్లి నేరుగా యాదగిరిగుట్ట పట్టణానికి చేరుకున్నారు. వారం రోజుల గడిచిన తరువాత నాని తల్లిదండ్రులు సబ్బుల కోసం డబ్బులు ఇవ్వడానికి హాస్టల్‌కు వెళ్లగా నాని హాస్టల్‌కు రాలేదని, రెసిడెన్షియల్ వార్డెన్ తెలిపారు. దీంతో వారు వెంటనే స్థానిక తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో తన కుమారుడు తప్పిపోయాడని ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి ఎక్కడ ఆరాతీసినా నాని జాడ దొరకలేదు. 30 రోజులుగా దేవస్థానం అన్నదాన సత్రంలో ప్రతిరోజు వారు భోజనం చేస్తూ ముగ్గురు కలిసి కొండపైన డార్మెటరీ హాల్‌లో రాత్రి బసచేస్తున్నారు. గణేష్‌రేణుకతో ఉండలేక నాని పట్టణంలోనిఇ ఒక మహిళ వద్ద ఫోన్‌తీసుకుని నల్లగొండలో ఉంటున్న తన తల్లికి ఫోన్‌చేసి తాను గుట్టలో బీసీ కాలనీలో ఉంటున్నాని తెలిపారు. దీంతో తన తండ్రి స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే నాని తండ్రి, కానిస్టేబుల్‌ను సతీష్‌ను వెంటబెట్టుకొని గుట్ట పోలీసుల సహకారంతో బీసీ కాలనీకి వెళ్లి నానిని దగ్గరికి తీసుకున్నాడు. నానిని తీసుకెళ్లిన దంపతులు గణేష్‌రేణులను తిప్పర్తి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. పారిపోయిన కుమారుడు దొరకడంతో రాములు సంతోషం వ్యక్తం చేశాడు.


కుల బహిష్కరణ చేసిన వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు

ఆత్మకూరు(ఎం) జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెర్ల గ్రామానికి చెందిన లోడి మత్స్యగిరి తన కుటుంబాన్ని కులబహిష్కరణ చేసిన వ్యక్తులపై చర్య తీసుకోవాలని కోరుతూ ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ గ్రామంలో తన తండ్రి సంపాదించిన భూమి విషయంలో గొడవలు జరగగా, కులపెద్దలు అనేక మార్లు తనతో జరిమాన కట్టించారని తెలిపారు. మళ్లీ ఇప్పుడు రూ. 30 వేలు జరిమానా కట్టాలని కులపెద్దలు తీర్మానించారని తెలిపారు. తాను చెల్లించలేనని అన్నందుకు డబ్బులు కట్టాలి లేదంటే కులం నుంచి వెలివేస్తామని కుల పెద్దలు తనపై కక్ష కట్టి తనను కుల బహిష్కరణ చేశారని తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

పాఠశాల స్థాయి జాతీయ పోటీల్లో ప్రవీణ్‌కు బంగారు పతకం

హుజూర్‌నగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో ఆదివారం జరిగిన 68వ జాతీయ స్థాయి స్కూల్‌గేమ్స్ వందమీటర్ల పరుగు పందెంలో హుజూర్‌నగర్ ఎస్సీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి కె. ప్రవీణ్ బంగారు పతకం సాధించాడు. వందమీటర్ల పరుగును 11.39సెకన్లలో పూర్తిచేసి న్యూ ఎస్‌జీఎఫ్ రికార్డును నెలకొల్పాడు. దీంతో పాఠశాల ప్రిన్సిపాల్ దున్నా వెంకటేశ్వర్లు, పీడీ అంజనేయులు, పీఈటీ రాములు విద్యార్థిని అభినందించారు. కాగా ఎస్సీ గురుకుల పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థి ఉపేందర్ తమిళనాడులో జరిగిన రెజ్లింగ్ పోటీలలో కాంస్య పతకం సాధించాడు. విద్యార్థులను అధ్యాపకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి



నాగార్జునకొండకు వెళ్లి లాంచి దిగి వస్తున్న పర్యాటకులు

నాగార్జునసాగర్, జనవరి12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవులు కావడంతో నాగార్జునసాగర్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి సాగర్ అందాలను తిలకించడానికి సాగర్‌కు భారీ సంఖ్యలో వచ్చారు. దీంతో బుద్ధవనం, అనుపు, ఎత్తిపోతల, కొత్తవంతెన ప్రాంతాల్లో సందడి నెలకొంది. జలాశయం మధ్యలో ఉన్న నాగా ర్జునకొండకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మూడు ట్రిప్పుల లాంచీలను నడిపినట్లు అధికారులు తెలిపారు.

సేంద్రియ సాగుతోనే సంపూర్ణ ఆరోగ్యం

భువనగిరి రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి)ః సేంద్రీయ వ్యవసాయ ద్వారా పండించిన పంటలతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సేంద్రీయ వ్యవసాయ నిపుణుడు కిరణ్‌కుమార్, వన్‌స్టాప్ సొల్యూషన్ ఫర్ యూత్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ చావా రాజ్‌కుమార్ అన్నారు. ఆదివారం భువనగిరిలో లీడ్ టుడే చేంజ్ టుమారో ఆధ్వర్యంలో సేంద్రియ ఎరువుల వాడకం, రసాయన పదార్థాల వినియోగంతో జరిగే అనార్థాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నూతన సేంద్రీయ ఆలోచనతో వ్యవసాయం చేస్తే సంపూర్ణ ఆరోగ్య భారత్ సాధించవచ్చునన్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడు అసిస్టెంట్ ప్రొఫెసర్ సూదగాని మహేశ్వర్ గౌడ్, వైస్ చైర్మన్ అంబోజు మల్లేశ్, జాయింట్ సెక్రటరి ఎంపాల కొండల్ రెడ్డి, తాడూరి శ్రావణ్‌కుమార్ తదితరులు మాట్లాడారు. శ్రావణ్ రెడ్డి, గడ్డమీద మల్లేశ్, బొజ్జ సురేశ్ ఉన్నారు.

రైతుకు రాణి రుద్రమదేవి అవార్డు

మోత్కూరు : మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని అరెగూడెం గ్రామానికి చెందిన సేంద్రియ రైతు బిల్లపాటి గోవర్ధన్‌రెడ్డికి ఆదివారం ఆది గురు భారత సంఘం రాణి రుద్రమదేవి ఉత్తమ సేంద్రియ రైతు అవార్డు అందజేసింది. వరంగల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో గోవర్ధన్‌రెడ్డికి ఈ అవార్డు అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఆత్మీయభరోసా' కల్పించరూ..

(3వ పేజీ తరువాయి)

ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి దూరమవ్వాల్సి వస్తోందని కూలీలు వాపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో దూరమవనున్న వ్యవసాయకూలీలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గత మున్సిపల్ ఎన్నికల సందర్భంలో ఏర్పాటైన కొత్త మున్సిపాల్టీలు, పాత మున్సిపాల్టీల్లో విలీనం చేసిన గ్రామాల్లో భారీ సంఖ్యలో ఉన్న భూమిలేని వ్యవసాయకూలీలు ఇప్పుడు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి దూరమవుతున్నారు. ఉదాహరణకు నల్లగొండ జిల్లా కేంద్ర మున్సిపాల్టీనే పరిగణనలోకి తీసుకుంటే ఇక్కడ విలీన గ్రామాలైన మర్రిగూడ, చర్లపల్లి, అర్జాలబావి, ఖతాల్‌గూడ, కేశరాజుపల్లి, శేషమ్మగూడెంలలో మూడువేల పైచిలుకు భూమిలేని వ్యవసాయ కూలీల కుటుంబాలు ఇప్పటికీ వ్యవసాయ పనులు చేస్తూ జీవనం గడుపుతున్నాయి. ఈ గ్రామాలన్నీ మున్సిపాల్టీలో చేరడంతో ఈ కుటుంబాలన్నీ ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకాన్ని అందుకోలేపోతున్నాయి. హాలియా మునిసిపాలిటీ పరిశీలిస్తే ఇక్కడ అనుముల, ఇబ్రహీంపట్నం గ్రామాల్లో దాదాపు 500 వ్యవసాయకూలీల కుటుంబాలు ఈ పథకానికి దూరమవుతున్నాయి. చిట్యాల మున్సిపాల్టీలో విలీనమైన శివనేనిగూడెంలోనూ ఇదే పరిస్థితి. ఇక్కడ కూడా 300 పైచిలుకు కుటుంబాలు ఈ పథకానికి దూరమవుతున్నాయని కూలీలు వాపోతున్నారు. నకిరేకల్ మున్సిపాల్టీ, మిర్యాలగూడ, దేవరకొండ మున్సిపాల్టీల్లో సైతం ఇలా వందలాది కుటుంబాలు ఈపథకానికి దూరమవుతున్నాయని, ఈ పథకం అమలుపై ప్రభుత్వం తక్షణమే సవరణలు చేయాలని, పట్టణ ప్రాంతాల్లో, ప్రధానంగా విలీన గ్రామాల్లో ఉన్న భూమిలేని వ్యవసాయ కూలీలను గుర్తించి వారికి కూడా ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకం అందించేలా చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు. ప్రజా ప్రభుత్వంలో తమకు అన్యాయం జరగనీయకుండా ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులు తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై కలెక్టర్లు కూడా సానుకూలంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదించాలని, తమకు న్యాయం చేయాలని పట్టణ ప్రాంత భూమిలేని వ్యవసాయకూలీలు విన్నవిస్తున్నారు.

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం పట్టివేత

మర్రిగూడ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని బోజ్యాతండాలో నన్సావత్ సునీల్ బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నాడు. దుకాణం తనిఖీ చేయగా 90లీటర్ల అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఐఎఫ్‌టీయూ విలీన సభను విజయవంతం చేయాలి

ఆలేరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి)ః ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో ఈనెల 18న నిర్వహిస్తున్న ఐఎఫ్‌టీయూ తెలంగాణ రాష్ట్ర విలీన సభకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్దన్ కోరారు. ఆదివారం ఆలేరులోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. విప్లవకర ట్రేడ్ యూనియన్‌గా ఉన్న ఐఎఫ్‌టీయూ దశాబ్దాలుగా కార్మికవర్గ ప్రయోజనాల కోసం పోరాడుతోందన్నారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి



సందీప్ కృష్ణ (ఫైల్ ఫొటో)

గుండాల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా సీతారాంపురం గ్రామానికి చెందిన వనమోజు సందీప్ కృష్ణ (18) గుండాల వైపు నుంచి సీతారాంపురం గ్రామానికి వస్తున్న క్రమంలో గ్రామ శివారులో సీతారాంపురం నుంచి గుండాల వైపు వెళుతున్న ట్రాక్టర్ వరినాటు వేసే యంత్రాన్ని తగిలించుకుని వెళుతుండగా ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న సందీప్ కృష్ణను ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్రంగా గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సందీప్ కృష్ణ హైదరాబాద్‌లోని టీకేఆర్ కళాశాలలో డిప్లొమా చదువుతున్నాడు. సంక్రాంతి సెలవుల సందర్భంగా స్వగ్రామానికి వచ్చాడు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పంచనామ నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని ఆలేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సందీప్‌కృష్ణ తండ్రి వనమోజు శ్రీధర్ సుద్దాలలో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆటోను, కారును ఢీ కొట్టిన మరో కారు..

మోటకొండూరు : ఎదురుగా వస్తున్న ఆటోను, రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన కారును మరో కారు ఢీ కొట్టిన ఘటన ఆదివారం యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని రాయగిరి, మోత్కూరు ప్రధాన రహదారి వెంట ఉన్న కాటేపల్లి గ్రామంలో జరిగింది. ఎస్ఐ పాండు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్నకారు కాటేపల్లి స్టేజి వద్ద రోడ్డు పక్కన పార్క్ చేసిన కారు, ఆటోను ఢీకొట్టింది. అదే సమయంలో ఆటోలో 9 మంది ప్రయాణికులు ఉన్నారు. అందులో నలుగురు పిల్లలు ఉన్నారు. పిల్లలకు స్వల్ప గాయాలు కాగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయాలైనవారిలో జయ (35) 7 నెలల గర్భిణి ఉంది. గాయాలైన వారు గుండాల మండలం పెద్ద పడిశాలకు చెందిన వారు. వారిని మెరుగైన చికిత్స కోసం భువనగిరిలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ పాండు తెలిపారు.

అందని హాస్టల్ బిల్లులు

● ప్రీమెట్రిక్‌గా గుర్తించి ప్రొసీడింగ్స్ ఇవ్వపోవడమే కారణం

● నార్కట్‌పల్లి బీసీ బాలుర ప్రత్యేక హాస్టల్ పరిస్థితి

నార్కట్‌పల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని బీసీ బాలుర ప్రత్యేక వసతిగృహం నిర్వహణ కేటగిరీపై నెలకొన్న గందరగోళానికి తెరదించిన శాఖా అధికారులు ప్రొసీడింగ్స్ ఇవ్వడం మరిచారు. దీంతో హాస్టల్ నిర్వహించినందుకు ఇవ్వాల్సిన బకాయి బిల్లులను ఏడాది కావస్తున్నా చెల్లించలేదు. బకాయి బిల్లుల మంజూరుకు ప్రొసీడింగ్స్‌కు ముడిపెట్టడమే ఇందుకు కారణం. దీంతో హాస్టల్ నిర్వహణకు తన సొంత డబ్బులను వెచ్చించిన వార్డెన్‌కు బిల్లుల కోసం ఎదురు చూపులు, ఇబ్బందులు తప్పడం లేదు.

పోస్టుమెట్రిక్‌గా మార్చి...

హాస్టల్ నిర్వహణకు ప్రతీ సంవత్సరం జిల్లా అధికారి రెన్యూవల్ చేయాల్సి ఉంది. ఈ ప్రకారమే 2023-24 విద్యా సంవత్సరానికి కూడా నార్కట్‌పల్లి బీసీ బాలుర హాస్టల్‌ను ప్రీమెట్రిక్ (పదో తరగతి విద్యార్థుల కోసం)గా ఏఎస్‌డబ్ల్యూవో రెన్యూవల్ చేశారు. దీంతో కొత్తగా మరో 20 మంది విద్యార్థులు కూడా చేరారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2023-24 విద్యా సంవత్సరంలో నార్కట్‌పల్లి మండల కేంద్రానికి జూనియర్ కాలేజీ మంజూరైంది. ఫలితంగా నార్కట్‌పల్లి బీసీ బాలుర హాస్టల్‌ను (కాలేజీ విద్యార్థుల కోసం) 25 ఆగస్టు 2023న పోస్టుమెట్రిక్ హాస్టల్‌గా గుర్తిస్తూ అధికారులు మధ్యంతర ఆదేశాలిచ్చారు. ప్రీమెట్రిక్ హాస్టల్ విద్యార్థులను సమీప వసతిగృహాలకు బదిలీ చేయాలని సూచించారు. అయితే సదరు ప్రీమెట్రిక్ విద్యార్థులు సమీప వసతిగృహాలకు వెళ్లేందుకు అయిష్టత చూపగా అప్పటి జిల్లా అధికారుల సూచన మేరకు ఇటు ప్రీమెట్రిక్‌గా అటు పోస్టమెట్రిక్‌గా రెండు కేటగిరీల విద్యార్థులకు భోజనాన్ని సమకూర్చారు.

బకాయి బిల్లులు ఇస్తామన్నారు

2023-24 సంవత్సరంలో పోస్టుమెట్రిక్‌గా మార్చిన అధికారులు తిరిగి ప్రీమెట్రిక్ హాస్టల్‌గా గుర్తించారు. ఐతే ఆ సమయానికి సంబంధించి ప్రొసీడింగ్స్ ఇవ్వాల్సి ఉంది. అది ఇస్తేనే పాఠశాల, కాలేజీ విద్యార్థులకు హాస్టల్‌లో భోజన వసతిని సమకూర్చిన బిల్లుల బకాయిలు వస్తాయి. ప్రొసీడింగ్స్ ఇస్తామని శాఖ జిల్లా అధికారులు హామీ ఇచ్చారు.

● యాదగిరిరెడ్డి, వార్డెన్, నార్కట్‌పల్లి



నార్కట్‌పల్లిలోని బీసీ బాలుర వసతి గృహం

పోస్ట్‌మెట్రిక్ కోడ్ ఇవ్వడం వల్లే...

అధికారుల ఆదేశాలతో హాస్టల్‌ను ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్‌గా నిర్వహించినా కోడ్ నెంబర్ మాత్రం పోస్ట్ మెట్రిక్‌గా ఇచ్చారు. కానీ కాలేజీ విద్యార్థుల సంఖ్య 18 ఉంటే ప్రీమెట్రిక్ విద్యార్థుల సంఖ్య మాత్రం దాదాపు 80గా ఉంది. దీంతో పోస్ట్‌మెట్రిక్ కోడ్‌పై బిల్లు పెడితే డబ్బులు నష్టపోతానని చెప్పిన వార్డెన్ ప్రీమెట్రిక్ హాస్టల్‌గా గుర్తించాలని బీసీ సంక్షేమ శాఖ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. వార్డెన్ విజ్ఞప్తికి తోడు వాస్తవ పరిస్థితులను పరిశీలించిన శాఖాధికారులు పోస్టుమెట్రిక్ హాస్టల్ నుంచి తిరిగి ప్రీమెట్రిక్ హాస్టల్‌గా 2024 మార్చిలోనే మార్చారు. కానీ దీనికి సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను నేటికీ ఇవ్వలేదు. ఈ కారణంగా 2023-24 సంవత్సరపు బకాయి బిల్లులు సుమారు రూ.5లక్షలకు పైగా నేటికీ అందలేదు. ఫలితంగా పాలు, కూరగాయలు, చికెన్, కిరాణ, గుడ్లను సరఫరా చేసిన వారికి బిల్లులను ఇవ్వకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు.

కేంద్రం విధానాలు మార్చుకోవాలి

మునుగోడు రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రైతాంగంపై కేంద్రప్రభుత్వం విధానాలు మార్చుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. ఆదివారం మండలంలోని కొంపల్లి గ్రామంలో ప్రజా సంఘాల సభ్యత్వ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రైతులకు రాత పూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇప్పటి వరకు ఏం చేశారని ఆయన కేంద్రప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు సాగర్ల మల్లేష్, వడ్లమూడి హనుమయ్య, మాదరగోని యాదయ్య, నరసింహ, రామచంద్రం, సైదులు, శంకర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలి

నల్లగొండ కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు, పీఆర్‌సీలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.వెంకట్‌రెడ్డి, నల్లగొండ తాలుకా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన పెన్షనర్ల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. పెన్షనర్లకు నగదు రహిత వైద్యం అందించాలని, పెండింగ్‌లో ఉన్న పెన్షనర్స్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం 45మంది పెన్షనర్ల జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సమావేశంలో సంఘం నాయకులు శ్రీశైలం, మోహన్‌రావు, రంగయ్య, సుధాకర్, పుల్లయ్య, రమేష్, అలీ, కృష్ణయ్య, రామలింగం, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



చెర్వుఅన్నారంలో ముగింపు క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు

కట్టంగూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించి పాఠశాలకు, గ్రామానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని మాజీ ఎంపీటీసీ ఎడ్ల పెద్ద రాములు, హెచ్ఎం రమ అన్నారు. మండలంలోని చెర్వుఅన్నారం గ్రామంలో 10 రోజులుగా ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కా ర్యదర్శి చింతకాయల పుల్లయ్య, ఉపాధ్యాయులు లింగయ్య, క్రీడాకారులు వెంకన్న, మధు, రాజు, శివ పాల్గొన్నారు.

'అమిత్‌షా రాజీనామా చేయాలి'

మునుగోడు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని మాలమహానాడు నేషనల్ స్టీరింగ్ కమిటీ సభ్యుడు గోలి సైదులు, జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మునుగోడులో మాలమహానాడు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అమిత్‌షా ఫ్లెక్సీని దహనం చేశారు. ఈ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమని అన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు చలిచీమల యాదగిరి, నాయకులు ఈద శరత్‌బాబు, బాలశివరాజు, ప్రమోద్‌కుమార్, యాదగిరి, జంగిలి నాగరాజు, వెంకట్, రవీందర్, ప్రణయ్, రామలింగయ్య శ్రీనివాస్, భరత్, ప్రసాద్ పాల్గొన్నారు.

కేతేపల్లిలో సంక్రాంతి ముగ్గుల పోటీలు 15న

కేతేపల్లి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కేంద్రం కేతేపల్లిలో ఈ నెల 15న మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొని అందమైన ముగ్గులు వేసిన వారికి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని అన్నారు.

మహిళా సాధికారత కోసం పోరాటం

● ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి



సభ్యత్వాలు అందజేస్తున్న ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభావతి

నల్లగొండరూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మహిళ సాధికారత కోసం ఐద్వా చేస్తున్న పోరాటంలో మహిళలు భాగసామ్యం కావాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి అన్నారు. ఆదివారం మండలంలోని చందనపల్లి గ్రామంలో నిర్వహించిన ఐద్వా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్తున్నా వారికి చిన్నచూపు తప్పడం లేదని అన్నారు. రోజు రోజుకు మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరిపాలన తీరు మారకపోతే మహిళల ని ష్పత్తి ఇంకా పడిపోతుందన్నారు. ఇప్పటికైనా మహిళలు ఐక్యమై పోరాటాలు చేసి మహిళా సాధికారత సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకురాలు కొండ అనురాధ, సైదమ్మ, వెంకటమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

కల్లోల కాలంలో జీవించిన కవి అలిశెట్టి

● ప్రెస్ అకాడమీ మాజీ అధ్యక్షుడు అల్లం నారాయణ



అలిశెట్టికి పురస్కారాన్ని అందజేసి సన్మానిస్తున్న నారాయణ

నల్లగొండ కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కల్లోల కాలంలో జీవించిన కవి అలిశెట్టి ప్రభాకర్ అని ప్రెస్ అకాడమీ మాజీ అధ్యక్షుడు అల్లం నారాయణ అన్నారు. కరీంనగర్‌లోని ఫిలింభవన్‌లో ఆదివారం తెరవే ప్రధాన కార్యదర్శి దామరకుంట శంకరయ్య అధ్యక్షతన నిర్వహించిన అలిశెట్టి ప్రభాకర్ రాష్ట్ర స్థాయి పురస్కారం-2025 సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పురస్కారాన్ని నల్లగొండ జిల్లా కవి డాక్టర్ బెల్లి యాదయ్యకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అలతి అలతి పదాలతో అనంత అర్థాలను సృజించిన గొప్ప కవిత్వం అలిశెట్టిదని అన్నారు. ప్రజల పక్షం వహించి కవిత్వం అలిశెట్టి రాశారని చెప్పారు. అది ఎక్కువ ప్రసంగిత కల సాహిత్యమని అన్నారు. పురస్కార శాశ్వత ప్రదాత, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు మాట్లాడుతూ అలిశెట్టి స్ఫూర్తితో సమ సమాజ నిర్మాణం కోసం కవులు కృషి చేయాలని అన్నారు. అలిశెట్టి స్ఫూర్తిని, ఆకాంక్షలను వచ్చే తరాలకు అందించాలని కోరారు. తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ బూర్ల వెంకటేశ్వర్లు, డాక్టర్ బెల్లి యాదయ్యను పరిచయం చేశారు. కార్యక్రమంలో ప్రజా గాయకుడు చింతల యాదగిరి, పాటల వెంకన్న, విప్లవకుమార్, క్రాంతి, కంబాలపల్లి కృష్ణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుని జీవితం యువతకు స్ఫూర్తి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

వివేకానందుని ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

నల్లగొండ కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకుసాగాలని పలువురు నాయకు లు పేర్కొన్నారు. స్వామివివేకానందుని జయంతి సందర్భంగా ఆదివారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పార్టీలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జిల్లాలో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ హిందూ ధర్మ, సనాతన ధర్మం విశిష్టతను ప్రపంచానికి స్వామి వివేకానందుడు చాటి చెప్పారని అన్నారు. స్వామి భావజాలాన్ని అనుసరించాలని, ఆయన అడుగుజడాల్లో నడవాలని కోరారు. ఈ సందర్భంగా పలు మండలాల్లో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్‌లోని వివేకాందుని విగ్రహాని కి పూజమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆర్ఎస్ఎస్ వి భాగ్ ప్రముక్ బి.కన్నయ్య మాట్లాడారు. వివేకానందస్వామి భావజాలాన్ని అనుసరించాలని, ఆయన అడుగుజాడల్లో నడవాలని కోరారు. తపస్



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, నాయకులు



నివాళులర్పిస్తున్న మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, నాయకులు

జిల్లా అధ్యక్షుడు ఇరుగు శ్రీరామ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో, ఉపాధ్యాయుల్లో వివేకానందుని బోధనలు, ఆశయాలను పెంపొందించేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్, ఆర్డీవో అశోక్ రె డ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిని భాస్కర్‌గౌడ్, నాయకులు గుర్రం ప్రభాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నర్సిరెడ్డి, రాజశేఖర్, మురళి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. డీవైఎస్‌వో ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీవైఎస్‌వో కుంభం నర్సిరెడ్డి, ఏఎస్పీ రా ములు నాయక్, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్‌రెడ్డి, గంజి రాజేందర్ పాల్గొన్నారు. వివేకానందుని బోధనలు యువతకు స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రెగట్టె మల్లికార్జున్ రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, యాదగిరి, గోపి, వెంకన్న, రమేష్ పాల్గొన్నారు.

నాంపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు దాచేపల్లి నర్సింహ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు చిరుమామిళ్ల గిరిబాబు, బీజేవైఎం మండల అధ్యక్షుడు నాంపల్లి సతీష్, నాయకులు పంగ ఈశ్వర్, శ్రీకాంత్, శివ, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూరులో స్వామి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గున్నాల నాగరాజు, బత్తిని నాగరాజు, పెద్ది సతీష్, పర్నె సంతోష్‌రెడ్డి, మహేష్, శ్రీశైలం, ఉదయ్, వాసు, సతీష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్, నాయకులు మాస శ్రీనివాస్, కన్నెబోయిన మహలింగం, చికిలంమెట్ల అశోక్, జయారపు రామకృష్ణ బానుక ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడులో బీజేపీ జిల్లా కార్యదర్శి బొడిగె అశోక్‌గౌడ్ మాట్లాడుతూ సమాజంలో వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు భవ నం మధుసూదన్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, పుల్కరం సైదులుముదిరాజ్, లింగస్వామి, కర్నాటి లింగయ్య, సతీష్, పందుల యాదయ్య, చెరుకు మల్లయ్య, మాజీద్, విష్ణు, అనిల్, మల్లేష్ పాల్గొన్నారు. మునుగోడు కు చెందిన స్వస్తిక్ మొబైల్ అండ్ ఎలక్ట్రానిక్ షాపు యజమాని రే వెల్లి వినయ్‌కుమార్ పట్టణంలోని శాఖా గ్రంథాలయానికి రూ. 18 వేలు విలువైన పుస్తకాలను బహూకరించారు.

మర్రిగూడలో యూత్ ఫర్ బెటర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఐ నవీన్‌కుమార్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు స్కూల్ బ్యాగులను అందజేశారు. కార్యక్రమంలో మర్రిగూడ ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి, యూత్ ఫర్ బెటర్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



బీజేపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

సమాధానం లేకనే ఉన్మాదపు దాడులు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహ

నల్లగొండ టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య శక్తులు విసిరే ప్రశ్నలకు సమాధానం లేకనే ఉన్మాదపు దాడులకు తెగిస్తున్నారని ప్రముఖ న్యాయవాది దర్శనం నర్సింహ అన్నారు. పట్టణంలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో ఆదివారం నిర్వహించిన 'భావ ప్రకటన స్వేచ్ఛ - విద్వేషపు దాడులు' అనే అంశంపై ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడా లేనంతగా భారతదేశంలో మతం పేరుతో మానవ హననం జరుగుతుందని అందులో భాగంగానే వీక్షణం వేణుగోపాల్, మెర్సి మార్గరేట్, ఉపాధ్యాయుడు రాములుపై జరిగిన దాడులు జరిగాయని అన్నారు. రాజ్యాంగం కల్పించిన శాస్త్రీయమైన హక్కులను, స్వేచ్ఛను, భావప్రకటనను విస్మరించి మతతత్వంతో ఊగిపోతూ రచయితలు, కవులు, మేధావులపై దాడులు పెచ్చు మీరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీహెచ్ సుధాకర్‌రెడ్డి, పన్నాల గోపాల్‌రెడ్డి, పందుల సైదులు, కె.పర్వతాలు, కె.అనంతరెడ్డి, మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి వీరస్వామి, దశరథ, చింతమల్ల గురవయ్య, రాములు, సాగర్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళలకు బహుమతులు అందజేస్తున్న వీరారెడ్డి

నల్లగొండ రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, వారిలో ఐక్యత భావాన్ని పెంచడం కోసమే సీపీఎం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలోని పలు వార్డులు, కాలనీల్లో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. 19వ వార్డులో నిర్వహించిన పోటీలకు ఆయన హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో నాయకులు అశోక్‌రెడ్డి, సయ్యద్ హసం, రవీందర్, శ్యాంసుందర్, పంచలింగం, నాగరాజు, అండాలు, సత్తయ్య, సలీం, తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: శాలిగౌరారంలోని గ్రామపంచాయతీ వద్ద యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో విజేతలకు మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్ బహుమతులు అందజేసి మాట్లాడారు. దేశం అభివృద్ధి చెందాలంటే మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు బండపెల్లి కొమరయ్య, ఇంతియాజ్ అహ్మద్, కుతాటి సోమయ్య, జీడికల్లు, రాజు తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలరూరల్: చిట్యాల మండలం వెలిమినేడులో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సంక్రాంతి పోటీలను సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ ప్రారంభించి మాట్లాడుతూ సంక్రాంతి క్రీడలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో బొంతల చంద్రారెడ్డి, అరూరి శ్రీను, నెలికంటి నర్సింహ, కూరాకుల నాగరాజు, పంది నరేష్, నాతి కిరణ్, దేశబోయిన నర్సింహ, అరూరి సుమన్, గోలి సాయికిరణ్, సరస్వతి, స్వరూప, నీరజ, ప్రణీత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

● కనగల్ మండలంలోని దోరెపల్లి గ్రామంలో బీజేపీ నాయకుడు మాదగోని నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బీజేపీ మహిళామోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొండేటి సరిత, జిల్లా మహిళా అధ్యక్షురాలు కాశమ్మ, నల్లగొండ పట్టణ అధ్యక్షురాలు తార, బీజేపీ మండల మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి పాలకూరి సరిత అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పులకరం బిక్షం, దాసరి వెంకన్న, పాలకూరి సైదులుగౌడ్, ఏడుకొండలు, అంజయ్య, హరిబాబు పాల్గొన్నారు.

నేతన్న అభయహస్తం చేనేత కార్మికులకు వరం



బ్రాహ్మణవెల్లెంలలో సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేనేత కార్మికులు

నల్లగొండ కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నేతన్న అభయ హస్తం పథకం చేనేత కార్మికులకు వరం లాంటిదని పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పొట్టబత్తున సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం వద్ద ఆదివారం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నేతన్న అభయ హస్తం, నేతన్న పొదుపు, నేతన్న భద్రత, నేతన్నభరోసా పథకాలను ప్రవేశపెట్టడం హర్షనీయమని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాపోలు దత్తగణేష్, చంద్రశేఖర్, గంజి నాగరాజు, యోగానందం, చంద్రయ్య, వెంకన్న, ఉపేందర్, రాజు, సతీష్, గిరి, ప్రసాద్, వీరస్వామి వెంకటమ్మ, చంద్రకళ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

● మునుగోడులో చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిల ఫ్లెక్సీలకు క్షీరాభిషేకాలు నిర్వహించారు.కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు చె రుకు సైదులు, కార్యదర్శి సింగం శివయ్య, పట్టణ అధ్యక్షుడు మధు, మిర్యాల అశోక్, నాయకులు మిర్యాల వెంకన్న, పాల్వాయి చెన్నారెడ్డి, సైదులు, పాల్వాయి జితేందర్‌రెడి, గిరిధర్, సైదులు, జనార్దన్, మల్లయ్య, శ్రావణ్‌కుమార్, రాము పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లెంల గ్రామంలో పద్మశాలీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సీహెచ్.రఘుపతి, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు మిర్యాల నర్సింహ, నాయకులు పున్న నాగార్జున, ఈపూరి నర్సింహ, రాములు, రాంనారాయణ, గోపాల కృష్ణ, వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న జడ్జిశ్రీనివాస్ దంపతులు

ఎల్లమ్మ ఆలయంలో సెషన్స్ జడ్జి పూజలు

కనగల్, జనవరి 12: (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని ఆదివారం ఖమ్మం జిల్లా సెషన్ జడ్జి వస్కుల శ్రీనివాస్ మహేశ్వరి దపంతులు సందర్శించారు. ఆలయ ప్రదిక్షణలు చేసి గర్భాలయంలోని అమ్మవారిని దర్శించుకున్నారు. కుంకుమ అభిషేక పూజలు జరిపించారు. అర్చకులు వేద ఆశీర్వచనాలను తీర్థప్రసాదాలను అందజేసారు. అంతకుముందు జడ్జికి సిబ్బంది ఆహ్వానం పలికారు.

చైనా మాంజాతో పర్యావరణానికి హానికరం

కనగల్, జనవరి 12: (ఆంధ్రజ్యోతి) చైనా మాంజాలు పర్యావరణానికి హాని చేస్తాయని జిల్లా ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శేఖర్‌రెడ్డి, బీట్ ఆఫీసర్ సౌజన్య అన్నారు. కనగల్ ఎక్స్‌రోడ్డులోని పంతంగుల విక్రయ దుకాణాల్లో ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చైనా మాంజాలను ప్రభుత్వం నిషేధించిందని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


తిప్పర్తి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పజ్జూరు ప్రభుత్వ పాఠశాలలో 1998-99 సంవత్సరంలో పదో తరగతి విద్యనభ్యసించిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన నాటి ఉపాధ్యాయులను సన్మానించారుకార్యక్రమంలో ఆనాటి ప్రధానోపాధ్యాయులు సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు సుధాకర్‌రావు, ఆశీర్వాదం, సుందరదేశకులు, నసూర్ ఉల్లా ఖాన్, భిక్షంరెడ్డి, శ్యామ్, సునీష, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

● శాలిగౌరారం: మండల కేంద్రంలోని జడ్పీ స్కూల్‌లో 2004- 05 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువులైన గురువారావు, కుశలవరెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారావు, అమృతాదేవి, యాదమ్మ, నాగభూషణాన్ని సన్మానించారు.

స్వాన్ సేవలు అభినందనీయం: రాకేశ్‌రెడ్డి

నార్కట్‌పల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సామాజిక స్పృహతో విద్యార్థులు, పాఠశాలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న స్వాన్ (స్టూడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నార్కట్‌పల్లి) సేవలు అభినందనీయమని క్రైడాయి జాతీయ ఉపాధ్యక్షుడు గుమ్మి రాంరెడ్డి, విద్యావేత్త రాకేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం నార్కట్‌పల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన స్వాన్ ద్వితీయ వార్షికోత్సవ సభకు వారు హాజరై మాట్లాడారు. సమావేశంలో వందేమాతరం రవీంద్ర, నవీన్‌కుమార్, స్వాన్ అధ్యక్షుడు మామిళ్ల సత్తిరెడ్డి, స్వామినాయక్, దామెర ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY
నల్లగొండ
3
సోమవారం 13 జనవరి 2025





నల్లగొండలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, చిత్రంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

అనర్హులెవ్వరికీ
రైతు భరోసా అందకూడదు

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఇందిరమ్మ రాజ్యంలో పేదవాని ఇళ్ల కల సాకారం
- రోడ్లు భవనాల శాఖ, సినిమాటోగ్రఫీ మంత్రి వెంకట్ రెడ్డి
- సేద్యానికి యోగ్యమైన ప్రతి ఎకరాకి రైతు భరోసా
- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి


రాష్ట్రంలో అనర్హులెవ్వరికీ రైతుభరోసా అందకూడదని, ఆ దిశగా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లోని ఉదయాదిత్యభవన్‌లో ఆయన శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో కలిసి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల మంజూరుపై ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అధికారులు, శాసన సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

- (నల్లగొండ టౌన్-ఆంధ్రజ్యోతి)


5



మాట్లాడుతున్న సుఖేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి



4

మూడు రోజుల పండుగకు ఉమ్మడి జిల్లా సర్వం సన్నద్ధమైంది. సోమవారం భోగి, మంగళవారం మకర సంక్రాంతి, బుధవారం కనుమ వేడుకలు జరుపుకొనేందుకు ప్రజలు ఇప్పటికే పట్టణాల నుంచి పల్లెలకు చేరుకున్నారు. ఊళ్లన్నీ ఆడపడుచుల సందడితో కళకళలాడుతున్నాయి. నేడు భోగి సందర్భంగా చిన్నారులకు భోగి పళ్లు పోయనున్నారు.

రాజకీయ సెగ

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల సవాళ్లు, ప్రతిసవాళ్లు
- స్థానికంకంటే ముందుగానే ఎన్నికల వేడి



స్థానిక సంస్థల ఎన్నికల వేళ.. జిల్లాలోని నియోజకవర్గాల్లో రాజకీయ వాతావరణంలో ఊహించని విధంగా వేడెక్కుతోంది. విమర్శ లు, ప్రతివిమర్శలు, సవాళ్లు... ప్రతిసవాళ్లతో నిత్యం రాజకీయం రాజుకుంది. ఈసారి జరిగే అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ క్లీన్‌స్వీప్ చేసుకునేందుకు కాంగ్రెస్ పక్కా ప్రణాళికతో ముందుకు అడుగులు వేస్తోంది. అయితే ప్రతిపక్ష పార్టీలు కూడా ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి..., ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. రానున్న సర్పంచ్, జిల్లా పరిషత్, మండల పరిషత్, సహకార సంఘాలు, మునిసిపాలిటీ ఎన్నికల్లో పైచేయి సాధించేందుకు రాజకీయ పార్టీలు పకడ్బందీ వ్యూహంతో ముందుకు సాగుతున్నాయి. జిల్లాలోని భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, తాజా మాజీ ఎమ్మెల్యేల మధ్య ప్రచ్ఛన్నయుద్ధం కొనసాగుతోంది.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

4

భువనగిరిలో హైటెన్షన్

ఎక్కడికక్కడ అడ్డగింతలు, అరెస్టులు



బీఆర్ఎస్, కాంగ్రెస్ వ్యూహ ప్రతివ్యూహాలు, పోలీసుల భారీ భద్రతా, భారీ కేడింగ్స్, రహదారులపై ప్రజల రాకపోకలపై కూడా విధించిన ఆంక్షలతో జిల్లా కేంద్రం భువనగిరిలో ఆదివారం తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. శనివారం జరిగిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ అదే రోజు యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంపై దాడి చేశారు. తిరిగి బీఆర్ఎస్ నాయకుల నిరసన ర్యాలీ, పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయింపు నేపథ్యంలో తలెత్తిన ఉద్రిక్తత రెండో రోజూ కూడా కొనసాగింది. - (భువనగిరి టౌన్-ఆంధ్రజ్యోతి)



యాదాద్రి థర్మల్ ప్లాంట్

పవర్‌ప్లాంట్ స్ర్కాప్ కుంభకోణంపై
నీలినీడలు!

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంటులో స్ర్కాప్ కుంభకోణంపై విచారణ అర్ధంతరంగా ఆగిపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పవర్‌ప్లాంటులో చోరీలపై 2017నుంచి కేసులు నమోదవుతున్నా పూర్తిస్థాయి విచారణ నిర్వహించకపోవ డం వెనక పెద్దమొత్తంలో ముడుపులు చేతులు మారాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ ప్లాంటు నుంచి రూ.100 కోట్ల పైచిలుకు విలువైన సామగ్రి చోరీకి గురైనా, పూర్తిస్థాయి విచారణ నిర్వహించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

- విచారణను అడ్డుకుంటున్న కీలక వ్యక్తులు
- ఖాకీలూ భాగస్వాములై అడ్డుకుంటున్నారనే గుసగుసలు
- రూ.100కోట్ల మేర సొత్తు బయటకు వెళ్లిందనే ఆరోపణలు
- జెన్‌కో, పోలీస్‌బాస్‌లు దృష్టిసారించి పూర్తి విచారణ జరపాలనే డిమాండ్



నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో ఇటీవల జరిగిన దొంగతనాలు పోలీస్ విచారణకే పరిమితమవుతుందే తప్ప, అంతకుమించి లోతుగా జరగడం లేదని స్పష్టమవుతోంది. ఈ దందాను వెనకనుంచి నడిపించి కాసులు పోగేసుకున్న ఖాకీలే విచారణ మందగించడానికి కారణమని తెలుస్తోంది. ప్లాంటులో జరిగిన స్ర్కాప్ దొంగతనాలపై జిల్లా నిఘావిభాగం నుంచి పూర్తిస్థాయి నివేదిక ఉన్నతాధికారులకు సమర్పించినా చర్యలు చేపట్టకుండా రాష్ట్రస్థాయిలో సదరు సూత్రధారుల పెద్దలు అడ్డుకుంటున్నట్లు ఇటు జెన్‌కోలో, అటు పోలీస్ వర్గాల్లో చర్చ సాగుతోంది.

ప్లాంటు శంకుస్థాపన నుంచి తిష్టవేసిన వారే..

పోలీస్, జెన్‌కో వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన వైటీపీఎస్ స్ర్కాప్ కుంభకోణం వెనక జెన్‌కోతోపాటు, పోలీ స్ శాఖలోని అధికారుల పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. ప్లాంటు శంకుస్థాపన సమయం నుంచి ఆ ప్రాంతంలో తిష్టవేసిన అధికారులు ఇందులో భాగస్వాములైనట్లు ఆరోపణలు వస్తున్నాయి. వీరి ప్రమేయంతోనే చోరీ అవుతున్న సామగ్రి పట్టుబడిన సందర్భంలో ఆ కేసును ఆ సంఘటన వరకే పరిమితం చేస్తున్నారని, పూర్తి విచారణ జరగకుండా సదరు పోలీసులు, జెన్‌కో అధికారులు రంగంలోకి దిగి మమ అనిపిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఉన్నతస్థాయిలో ఉన్న తమ పెద్దల ద్వారా వీరు విచారణ ముందుకుసాగకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఆరునెలల క్రితం వెలుగులోకి వచ్చిన ఒక చోరీ సందర్భంలో విచారణ కొనసాగుతుందని పోలీస్‌బాస్ పేర్కొన్నప్పటికీ, విచారణాధికారులు దాన్ని అటకెక్కించారని పేర్కొంటున్నారు. అయితే ఉన్నతాధికారుల సూచనల మేరకు వైటీపీఎస్‌లో స్ర్కాప్ కుంభకోణంపై జిల్లా పోలీ స్ నిఘా విభాగం నుంచి పూర్తి నివేదిక వెళ్లిందని, ఈ కుంభకోణాన్ని వెనకుండి నడిపిన కీలక వ్యక్తులు ఈ నివేదికపై చర్యలు తీసుకోకుండా రాష్ట్రస్థాయిలోనూ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని పోలీస్‌వర్గాల్లో టాక్ కొనసాగుతోంది. జెన్‌కో మాజీ ముఖ్యఅధికారికి సన్నిహితులమని చెప్పుకునే ఒక పోలీసాయన ఈ మొత్తం తతంగాన్ని కొనసాగిస్తున్నారని, ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపిస్తే మొత్తం కుంభకోణం వెలుగులోకి వస్తుందని, పోలీస్ ఉన్నతాధికారులు ఈమేరకు కార్యాచరణ చేపట్టాలనే సూచనలు వస్తున్నాయి.

పటిష్టమైన భద్రతా వ్యవస్థ ఉన్నప్పటికీ..



దాదాపు రూ.40వేల కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం నల్లగొండ జిల్లా వీర్లపాలెం వద్ద యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ని నిర్మిస్తోంది. ప్లాంట్ చుట్టూ సీసీ కెమెరాల నిఘా, పాస్‌లు, అనుమతి పత్రాలుంటేనే ఎవరినైనా, ఏ వాహనాన్నైనా లోపలకు గానీ, బయటకు గానీ అనుమతించేలా కట్టుదిట్టమైన భద్రతా వ్యవస్థ కొనసాగుతోంది. ప్రత్యేకంగా సీఆర్ఎఫ్ బలగాలు.. ఇక్కడ ఒక డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో...

- మిగతా 5వ పేజీలో...

'ఆత్మీయభరోసా'
కల్పించరూ..

- కొత్తమున్సిపాల్టీలు, విలీన గ్రామాల్లో పథకాన్ని పొందలేకపోతున్నవైనం
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భారీగా పథకాన్ని కోల్పోతోన్న కూలీలు



నల్లగొండ, జనవరి 12 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం తమకూ వర్తింపజేయాలనే డిమాండ్ పట్టణ ప్రాంత వ్యవసాయకూలీల నుంచి బలంగా వినిపిస్తోంది. భూమిలేని వ్యవసాయ కూలీలకు ఈపథకం ద్వారా ఏడాదికి రూ.12వేల ప్రోత్సాహకం అందజేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఈ నెల 26 నుంచి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం కింద లబ్ధిదారులను మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నమోదైన కూలీల ద్వారా (జాబ్‌కార్డులు) గుర్తించాలని ఇటీవల నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ప్రభుత్వం సూచించింది. ఈ పథకంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20రోజులు పనిచేసిన కూలీ కుటుంబా న్నే అర్హత కలిగిన కుటుంబంగా గుర్తించాలని సూచించారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ పట్టణప్రాంతా ల్లో, ప్రధానంగా నూతనంగా ఏర్పాటైన మున్సిపాల్టీల్లో, పెద్ద మున్సిపాల్టీలను విస్తరించే క్రమంలో విలీనం చేసి న గ్రామాల్లో, మున్సిపాల్టీగా మార్చినప్పటికీ వ్యవసాయమే ప్రధానంగా ఉన్న పట్టణాల్లోని వ్యవసాయ కూలీలు తమకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయాల ని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ వ్యాప్తంగా 40 శాతం మేర పట్టణీకరణ జరిగిందని, పౌరసేవల సౌల భ్యం, అభివృద్ధి, సంక్షేమ పథకాలు, స్మార్ట్ పాలన పేరు తో పదివేల జనాభా ఉన్న ప్రాంతాలనూ మున్సిపాల్టీలుగా మార్చారని పేర్కొంటున్నారు. దీంతో తమకు ఒరిగిందేమీ లేకపోగా, కనీస పని గ్యారంటీ కల్పించే ఉపాధి హామీ పథకాన్ని కోల్పోగా, తాజాగా....

- మిగతా 5వ పేజీలో...

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



సాగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

నాగార్జునసాగర్, జనవరి12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అక్రమ అరెస్టులు అప్రజాస్వామికమని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన సాగర్ హిల్‌కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలపై కాంగ్రెస్ కార్యకర్తల దాడికి నిరసనగా కార్యాలయాన్ని పరిశీలించడానికి వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తయినప్పటికీ రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడటంలో విఫలమయ్యారన్నారు. హైడ్రా,మూసీ పరిరక్షణ పేరుతో పేదల నివాసాలను కూల్చి వేస్తున్నారన్నారు. లగచర్లలో అమయాకులైన గిరిజనులపై కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. ఆయనవెంట బీఆర్ఎస్ నాయకులు రమేష్‌జీ, చంద్రమౌళి, హలీం, శేఖరాచారి, సైదులు, అర్జున్, జిలానీ, ముత్తయ్య ఉన్నారు.

కన్నుల పండువగా ఎదుర్కోలు

సంప్రదాయబద్ధంగా గోదా రంగనాయకస్వామికి పూజలు



నల్లగొండలోని రామాలయంలో ఎదుర్కోలు మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు





ప్రత్యేక అలంకారంలో ఉత్సవ మూర్తులు


నల్లగొండ కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస వ్రత మహోత్సవంలో భాగంగా ఆదివారం రాత్రి నల్లగొండ పట్టణంలోని పలు దేవాలయాల్లో స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం సాంప్రదాయరీతిలో నిర్వహించారు. రామగిరిలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో గోదాదేవి, రంగనాయకస్వామిల ఎదుర్కోలు మహోత్సవాన్ని అర్చకస్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారు, స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి వేర్వేరుగా వాహనాలపై ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రజలు, భక్తుల సమక్షంలో శాస్త్రోక్తంగా నిశ్చితార్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. భాష్యం జగన్నాథాచార్యుల ఆధ్వర్యంలో రంగనాథస్వామిని వరించేందుకు గోదాదేవి వ్రత పూజను భక్తులకు వివరించారు. స్వామి వారి ఎదుర్కోలు మహోత్సవం చూడముచ్చటగా సాగింది. రంగనాయకస్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని సోమవారం రాత్రి 7గంటలకు నిర్వహించేందుకు నిశ్చయించినట్లు అర్చకులు తెలిపారు. స్వామి, అమ్మవా రి తరపున శఠగోపాలాచార్యులు, యాదగిరాచార్యులు తదితరులు వ్యవహరించారు. నేడు జరిగే గోదా రంగనాయకస్వామిల తిరు కల్యాణ మహోత్సవానికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరుకానున్నారని ఆలయ ఈవో జయ రామయ్య తెలిపారు. కార్యక్రమంలో నల్లగొండ మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ ఈవో జయ రామ య్య, చకిలం వేణుగోపాల్‌రావు, సంధ్యారాణిలతోపాటు వికాస తరంగిణి సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పానగల్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో, వీటీ కాలనీలోని శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎదుర్కోలు కార్యక్రమం కన్నుల పండువగా సాగింది.

కల్యాణానికి ముస్తాబైన ఆలయాలు

ధనుర్మాస వ్రత మహోత్సవం చివరిరోజు సందర్భంగా పట్టణంలోని పలు దేవాలయాల్లో జరిగే శ్రీ గోదా రంగనాయక స్వామిల తిరు కళ్యాణ మహోత్సవానికి ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి. భక్తుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. ఆలయాలన్నీ విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. జిల్లాకేంద్రంలోని రామగిరిలోగల రెండో భద్రాద్రిగా పేరొందిన సీతారామచంద్ర స్వామి దేవాలయం కల్యాణానికి సర్వం సిద్ధమైంది. కల్యాణ వేదికను అందంగా తీర్చిదిద్దారు. హాజరయ్యే భక్తుల కోసం ప్రత్యేక వసతులు కల్పించారు. మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి కల్యాణ నిర్వహణ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.



జిల్లాకేంద్రంలో మరియమాత తిరునాళ్లకు ముస్తాబైన చర్చి



విద్యుద్దీపాల వెలుగుల్లో చర్చి ప్రధాన ద్వారం

మరియమాత తిరునాళ్లకు ముస్తాబు

నేటి నుంచి మూడు రోజులపాటు మరియమాత తిరునాళ్లు కొనసాగనున్నాయి. ఈ వేడుకల కోసం జిల్లాకేంద్రంలోని మరియమాత చర్చిని అందంగా ముస్తాబు చేశారు. ఆదివారం రాత్రి విద్యుద్దీపాల అలంకరణలో చర్చి మంత్రముగ్ధుల్ని చేస్తోంది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

నిర్మాణ పనులు
నాణ్యత పాటించాలి

హాలియా, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో చేపడుతున్న పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్, కౌన్సిలర్ ఫోరం జిల్లా అధ్యక్షుడు వర్ర వెంకట్‌రెడ్డి అన్నారు. హాలియా మునిసిపాలిటీలోని 11వ వార్డు నిర్మల స్కూల్ రోడ్డు ముత్యాలమ్మ గుడికి వెళ్లే రహదారిలో చేపడుతున్న సీసీ డ్రైన్, కల్వర్టు, సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.


పనులు పరిశీలిస్తున్న నాయకులు

జోరుగా కల్తీ నూనె విక్రయాలు


కొండమల్లేపల్లిలో జోరుగా కొనసాగుతున్న లూజు నూనె విక్రయాలు

- సంక్రాంతి నేపథ్యంలో వ్యాపారం
- బ్రాండెడ్ నూనెల ధరలు వసూలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

దేవరకొండ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లో కల్తీనూనె విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఈ అమ్మకాలు పెరిగాయి. దేవరకొండ డివిజన్ పరిధిలోని గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కొంత మంది వ్యాపారులు ప్రధాన వీధుల్లో లూజు నూనె విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. సంక్రాంతి పండుగ కావడంతో మంచినూనె కొనుగోలుకు గిరాకీ పెరిగింది. దేవరకొండ, కొండమల్లేపల్లి, అంగడి పేట, పోలేపల్లి, చింతపల్లి ప్రధాన కేంద్రాలలోని కూడలిలో విచ్చలవిడిగా లూజు నూనె విక్రయిస్తున్నారు. ఏ రకం నూనెనో తెలియక వినియోగదారులు వ్యాపారులు చెప్పిన రేటుకే కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. దీంతో పాటు పలు దుకాణాల్లో వివిధ బ్రాండ్లతో నూనె అమ్ముతున్నారు. పేరుపొందిన కంపెనీల నూనెలతో సమానంగా లూజు నూనె కూడా కేజీ రూ. 140 నుంచి 150 వరకు విక్రయిస్తున్నారు. తూనికలు, కొలతల శాఖ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేయకపోవడంతో వ్యాపారులకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. కల్తీనూనె కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని డాక్టర్లు చెబుతున్నారు. కల్తీనూనె విక్రయిస్తున్న వారిపై నిఘా ఏర్పాటు చేసి చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు. ఈ విషయమై దేవరకొండ ఆర్డీ వో రమణారెడ్డిని వివరణ కోరగా విచారణ చేసి కల్తీనూనెలు, వస్తువులు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని తనిఖీలు చేపడుతామన్నారు.

కల్తీనూనె విక్రయిస్తున్న వారిపై చర్య తీసుకోవాలి



దేవరకొండ, కొండమల్లేపల్లితో పాటు గ్రామాల్లో కల్తీ నూనె అమ్ముతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడమే కారణం. ఏది నాణ్యమైన నూనెనో, ఏది కల్తీనూనెనో తెలియక మోసపోతున్నాం. కల్తీ నూనెతో ఆరోగ్యం దెబ్బతింటుంది. విచారణ జరిపి వారిపై చర్య తీసుకోవాలి.

- బిజిలి లింగయ్య, దేవరకొండ

నేడు శ్రీగోదా రంగనాథుల
కల్యాణోత్సవం

దేవరకొండ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలోని శ్రీ గరుడాద్రి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 13న ఉదయం 10 గంటల నుంచి శ్రీగోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం ప్రారంభమవుతుందని దేవాలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆలంపల్లి నర్సింహ, దొడ్డి అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధనుర్మాసం పురస్కరించుకొని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో జరగనున్న శ్రీగోదా రంగనాథుల తిరుకల్యాణ మహోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేశామని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణోత్సవంలో పాల్గొని మొక్కులు తీర్చుకోవాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న చినపాక లక్ష్మీనారాయణ

చిత్తశుద్ధితో హామీలు అమలుచేయాలి : సీపీఎం

నిడమనూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. నిడమనూరు మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని, ఏడాదైనా ఉచిత బస్సు ప్రయాణం మినహా మిగతా హామీలు అమలు చేయలేదని విమర్శించారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. వ్యవసాయ కార్మికులకు రూ.12 వేలు ఇవ్వాలని, ఆసరా పింఛన్లు రూ.4 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల్లో లబ్ధిదారులను ఎంపిక చేయాలని, పారదర్శకత లోపిస్తే ప్రజా ఉద్యమాలు తప్పవని ఆయన హెచ్చరించారు. సమావేశంలో నాయకులు కొండేటి శ్రీను, కందుకూరి కోటేష్, కొమాండ్ల గుర్వయ్య, బాలనారాయణ, ముత్యాల కేశవులు పాల్గొన్నారు.

దాడుల విషసంస్కృతిని ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్

- మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో విమర్శలు, ప్రతివిమర్శలు సహజం కానీ కాంగ్రెస్ వచ్చాక దాడుల విష సంస్కృతిని ప్రోత్సహిస్తుందని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఇలాగే దాడులు జరిగి ఉంటే మీకు మాట్లాడే పరిస్థితులు ఉండేవా అని ఆయన ప్రశ్నించారు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో, ఏడాది కాంగ్రెస్ పాలనలో అశాంతి, అలజడి నెలకొందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి చేసిన వారిని గుర్తించి, తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు పునరావృతమైతే ఊరుకునేది లేదని తగిన రీతిలో బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు.


బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి హేయమైన చర్య

చందంపేట: భువనగిరిలో బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడి హేయమైన చర్య అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు జర్పుల లోక్యానాయక్ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమైన కాంగ్రెస్‌ను ప్రశ్నిస్తుంటే దాడులకు దిగడం దిగుజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. దాడులు ఇలా కొనసాగిస్తే ప్రతిచర్య తప్పదని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల నాయకులు గోసుల శివశంకర్, తిరుపతయ్య, శ్రీశైలం, వెంకటేశం, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలి

దేవరకొండ, కొండమల్లేపల్లి, హాలియా, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానందుని ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గుండాల అంజయ్యయాదవ్ అన్నారు. దేవరకొండ డివిజన్‌లోని పలు మండలాల్లో ఆదివారం స్వామి వివేకానంద జయంతిని బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానందుడి విగ్రహాలు, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ దేశం కోసం, ధర్మం కోసం వివేకానంద చేసిన కృషిని కొనియాడారు. యువత ను చైతన్యపరిచి వారి లక్ష్యాలు ఎలా ఉండాలో తెలియజెప్పిన మహానుభావుడని కొనియాడారు. వివేకానందుని ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలని కోరారు.

దేవరకొండలో వివేకానందుడి జయంతిని బీజేపీ పట్టణశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వస్కుల సుధాకర్, నక్క వెంకటేష్‌యాదవ్, నేతాళ్ల వెంకటేష్, చండీశ్వర్ పాల్గొన్నారు. వాసవీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వాసవీవనితాక్లబ్, వాసవీక్లబ్ నేతలు బెలిజ మాధవి, గోవింద్, కొండయ్య, ఆలంపల్లి పద్మ, బిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.


దేవరకొండ: వివేకానందుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు కర్నాటి సురేష్, వస్కుల సుధాకర్

కొండమల్లేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జంగిటి మల్లేష్‌యాదవ్, భూతరాజు భరత్‌కుమార్, నెల్లికంటి గోపి, తారయ్య, గంట శ్రీను, వశ్యానాయక్, అంజినాయక్, రమేష్, విజయ్, మల్లేష్, శివలాల్, సంతోష్, ఉదయ్, చందు, అజయ్, మధు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని గుమ్మడవెల్లిలోని స్థానిక పాఠశాలలో జన చైతన్య యుజన సంఘం ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు షేక్ ఫయాజ్, కె.శంకర్, నర్సింహ, మహేష్, బోడ యాదయ్య, ఆదిరాల రాము, బొడ్డుపల్లి సైదులు, శ్రీను, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

హాలియాలో నిర్వహించిన కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి సభ్యుడు గుర్రం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానందుని జీవి తం యువతకు ఆదర్శనీయమని అన్నారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి సభ్యులు రాయపోలు మురళీశర్మ, నోముల నరేష్, సాయి, చందు, మణి, రామాంజిరెడ్డి, వెంకటేష్, అఖిల్, సందీప్ పాల్గొన్నారు అనుముల మండలం నాయుడుపాలెం గ్రామంలో టీపీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందా సైదులురావుగౌతమ్ ఆధ్వర్యంలో వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన సేవలను కొనియాడారు.



హాలియా: నివాళులర్పిస్తున్న వివేకానంద సేవా సమితి సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి


కొండమల్లేపల్లి: చౌరస్తాలో వివేకానందుడికి నివాళులర్పిస్తున్న రాములు

యువత క్రీడల్లోనూ రాణించాలి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, జనవరి 12: యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూకల వేణుగోపాల్‌రెడ్డి ఫౌండేషన్ సభ్యుడు ఆడోతు అశోక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి ఎన్‌వీఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని అన్నారు. క్రీడలతో శారీరక వ్యాయామంతో పాటు గెలుపు కోసం వ్యూహ, ప్రతివ్యూహాలతో ఆలోచనలకు పదును పెట్టవచ్చని అన్నారు. పట్టుదలతో కృషి చేసి గ్రామీణ పట్టణ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలని ఆకాక్షించారు.


అయ్యప్ప ఆలయంలో ఎమ్మెల్యే బీఎల్ఆర్‌కు పరీక్షప్యాడ్‌లతో తులాభారం

ఎమ్మెల్యేకు పరీక్ష ప్యాడ్‌లతో తులాభారం

పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం, పొలిమేడు ఆశ్రమంలో అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమానికి ఎమ్మెల్యే బీఎల్ఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పరీక్షప్యాడ్‌లతో తులాభారం వేశారు. వీటిని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎన్‌వీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నూకల వేణుగోపాల్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు నర్సిరెడ్డి, రవినాయక్, నాగలక్ష్మి, వెంకన్న, మాజీ ఎంపీటీసీ బెజ్జం సాయి, శ్రీధర్‌గౌడ్, నాగునాయక్, అశోక్, కృష్ణ, భీమేష్, లక్ష్మణ్, చిలుకూరు బాలు, మందడి నర్సిరెడ్డి, దేశిడి శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

తిరుమలగిరి(సాగర్): క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం అలవడుతుందని ఎస్ఐ వీరశేఖర్ అన్నారు. మండలంలోని తిమ్మాయిపాలెం గ్రామంలోని ఎంప్లాయిస్, యూత్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఎస్ఐ వీరశేఖర్ ప్రారంభించి మాట్లాడారు. క్రీడల వల్ల గ్రామాల మధ్య స్నేహ సంబంధాలు మెరుగవుతాయని, యువత క్రీడల్లో రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో శౌరీనాయక్, లాలునాయక్, పాండునాయక్, మునినాయక్, బుజ్జినాయక్, బిచ్యాలు, సీతారాంనాయక్, బాలకృష్ణ, తులసీరాం, అర్జున్, నాగ, క్రీడాకారులు పాల్గొన్నారు.

● నేరేడుగొమ్ము మండలం పెద్దమునిగల్ జడ్పీ హైస్కూల్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లోకసాని కృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజర్లు చంద్రశేఖర్, సిద్దు, వీరేందర్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు నీలం ఆంజనేయులుయాదవ్, నాయకులు మురళీకృష్ణ, పంబాల అంజయ్య, పంబాల పర్వతాలు, ఎల్లయ్య, వాసుదేవ్, భాను, విజేయుడు, నాగరాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


తిమ్మాయిపాలెంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్ఐ వీరశేఖర్


వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న లోకసాని కృష్ణ

రక్తదానం మరొకరికి ప్రాణదానం


పీఏపల్లిలో ఉత్సాహంగా రక్తదానం చేస్తున్న యువకులు

పెద్దఅడిశర్లపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రక్తదానం మరొకరికి ప్రాణదానం అవుతుందని రివర్ నిమ్స్, సూర్య హాస్పటల్ ఎండీ డాక్టర్ పాల్వాయి వెంకట్‌రెడ్డి అన్నారు. పీఏపల్లి మండలకేంద్రంలో ఆదివారం రివర్ నిమ్స్, సూర్య హాస్పటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్యశిబిరం, రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అన్ని దానాల్లో కన్నా రక్తదానం ఉన్నతమైనదని అభిప్రాయపడ్డారు. రక్తదాతలు ఆపదలో ఉన్న బాధితులకు ప్రాణదాతలతో సమానమని అన్నారు. వివేకానంద జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దాదాపు 25 మంది యువకులు రక్తదానం చేశారు. వైద్యశిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి మేనేజింగ్ పార్టనర్ వంగాల శ్రీనివాస్‌రెడ్డి, ఘనపురం శంకర్, గోర్ల శ్రీనివాస్, మహేందర్, ఉప్పల కోటి, జాన్‌రెడ్డి, ఘనపురం రవి తదితరులు పాల్గొన్నారు.

27 సంవత్సరాల తర్వాత...

- ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నాగార్జునసాగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలో ఉన్న ప్రభుత్వ బీఈడీ కళాశాలలో 1998-99 సంవత్సరంలో విద్యనభ్యసించిన నాటి విద్యార్థులు ఆదివారం సాగర్ హిల్‌కాలనీలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రస్తుతం వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడిన వారంతా ఒకచోట చేరారు. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో అప్పటి అధ్యాపకులు చంద్రశేఖర్, ప్రసాద్, వెంకట్‌రెడ్డి, కృష్ణవేణి, జనార్ధన్‌లను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు శైలజ, షబానా, నాగరాణి, ఉపేందర్, శివ, సూర్య, రవీందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.


పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న నాటి విద్యార్థులు

మహిళా అభివృద్ధితోనే సమాజ అభివృద్ధి



విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న అవుతా సైదులు

హాలియా, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మహిళా అభివృద్ధి జరిగితేనే సమాజాభివృద్ధి జరుగుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు అన్నారు. హాలియాలో 12వ వార్డులో సీఐటీయూ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వం 44 కార్మిక చట్టాలను కుదించి నాలుగు కోడ్‌లుగా చేసిందని, దీనివల్ల మహిళా కార్మికులు, కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. మహిళలు రాజకీయ చైతన్యం కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సహకరించిన దాతలు అప్పారెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంపటి శ్రీను, మారం రవీందర్, హరిలాల్‌లక ధన్యవాదాలను తెలిపారు.

అనంతరం ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదాంన చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రెవల్లి వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, రెడ్డిమల్ల సురేష్, ఖాసీం, పొదిల వెంకన్న, కారంపూడి ధనమ్మ, జటావత్ రవినాయక్, సంజీవ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి

- మరొకరికి గాయాలు
- మృతుడు గ్రామ జీపీ మల్టీపర్పస్ వర్కర్


పాపయ్య మృతదేహం

మాడ్గులపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో మల్టీపర్పస్ వర్కర్ మృతి చెందాడు. ఈ ప్రమాదం మండలంలోని ఆగామోత్కూర్ గ్రామ పరిధిలోని చిన్నగూడెంలో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.... ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన గంజి పాపయ్య (40), నామా ఆదామ్‌లు గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా గ్రామంలో వాటర్ సప్లయ్ చేసేందుకు ఆదివారం ఉదయం వెళ్లారు. తిరిగి ఆగామోత్కూర్‌కు వస్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి కిందపడటంతో ట్రాక్టర్ నడుపుతున్న గంజి పాపయ్యతో పాటు ఆదామ్‌కు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ఎక్స్‌కవేటర్ సహాయంతో ట్రాక్టర్ కిందపడి గాయాలపాలైన పాపయ్యను, ఆదామ్‌లను బయటకు తీసి అంబులెన్స్ సహాయంతో మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు పాపయ్య అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. గాయాలపాలైన ఆదామ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతి చెందిన పాపయ్య మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిలోని మార్చురీలో ఉంచినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి పాపయ్యకు భార్య స్రవంతి, ఒక కుమారుడు ఉన్నారు. పంచాయతీ కార్యదర్శి మోదుగు నాగేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నాగార్జునసాగర్, జనవరి12 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే అందజేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు బషీర్ డిమాండ్ చేశారు. నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని మునిసిపల్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన కార్మికులకు సీఐటీయూ సభ్యత్వ నమోదు రశీదులను అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. డ్రెస్ మార్చుకోవడానికి ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు దొంతాల నాగార్జున, శివ, జానీ, భాస్కర్, తాహేర్, శ్రీకాంత్, లక్ష్మణ్, గౌస్, తదితరులు పాల్గొన్నారు.


సీఐటీయూ సభ్యత్వ నమోదు రశీదులను కార్మికులకు అందజేస్తున్న బషీర్

గిరిజన, ఆదివాసీలు సంఘటితం కావాలి

- గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రమావత్ దినేష్‌నాయక్


సాగర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దినేష్‌నాయక్

నాగార్జునసాగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఉన్న గిరిజన, ఆదివాసీలు సంఘటితం కావాలని గిరిజన ప్రజా సమాఖ్య (జీపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు రమావత్ దినేష్‌నాయక్ తెలిపారు. నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని రెడ్డి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ నెల 19వ తేదీన గిరిజన ఆదివాసీల సమ్మేళన మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకర్‌రావు, కేరళ ఐజీ లక్ష్మణ్‌నాయక్, వడ్త్య శంకర్‌నాయక్, మాజీ ఎంపీ సీతారాంనాయక్ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ మహాసభలకు గిరిజన సంప్రదాయాల, సంస్కృతిలో కొనసాగుతాయన్నారు. గిరిజన ఆదివాసీల ఆత్మగౌరవ సభకు అధిక సంఖ్యలో గిరిజనులు, ఆదివాసీలు మహాసభకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జీపీఎస్ నాయకులు సర్దార్‌నాయక్, వెంకటేష్‌నాయక్, రమేష్‌నాయక్, భూరో నాయక్, గోలియానాయక్, భరత్‌నాయక్ పాల్గొన్నారు.